ప్రజాశక్తి

Vol. 4, no. 1

(Jan. 5, 1944)

బెజవాడ, 1944

Record no. 683

Prajāśakti

Vol. 4, no. 1

(Jan. 5, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

0-2-0 Regd. No M. 4486

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 4 | సంచిక 1

: సంపాదకవర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు (సం)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

బుధవారం 5-1-44



84 గురు — 30 మంది కూలీలు, 54 గురు రైతులు — రావులపాడులో వరికోతకోసి, వచ్చినడబ్బును కూలీసంఘానికి విరాళమిచ్చారు.

లీగ్ - హిందూమహాసభల ధోరణులు

డిశెంబరు ఆఖరువారం క్రిస్టమస్ పండుగలవారం. నగరాలలో వినోదాలు-మహోత్సవాలు జరగడం పరిపాటి. ఈ పండుగలతోపాటే వివిధపార్టీల, సంస్థల వార్షికసభలు జరగడం సాంప్రదాయమైపోయింది. ఈ ఏడాది ముస్లింలీగ్ మహాసభ, హిందూ మహాసభ, లిబరల్ మహాసభ, అర్థికమహాసభ వగైరా మహోత్సవాలు జరిగాయి. అయాసంస్థలు భారత రాజకీయ ప్రతిష్టంభనను తొలగించడానికి తీర్మానాలు చేశాయి. కార్యక్రమాన్ని సూచించాయి. వీటిని సమగ్రంగా పరిశీలించుదాం.

లీగ్ మహాసభ

ముస్లింలీగ్ 31 వ వార్షిక మహాసభ కరాచీనగరంలో బ్రహ్మాండంగా జరిగింది. విశాలమైనపందిరిలో అనేకమందిప్రతినిధులు, 52 వేలమంది ముస్లిం ప్రజల సమక్షంలో 24 వ తేదీ రాత్రి సమావేశం ప్రారంభమయింది. ఆహ్వానసంఘాధ్యక్షుడు జి.యం. సయ్యద్ ఉపన్యసించుతూ సింధునది, దాని ఉపనదులు ప్రవహించే పంజాబు, కాశ్మీర్, సరిహద్దురాష్ట్రం, బెలూచిస్థాన్, సింధు రాష్ట్రాలే పాకిస్థాన్‌కు పునాది కాబోతున్నాయని తెలియజేశాడు. సింధునది ప్రాంతంలోనే అనేక తెగలు, నాగరికతలు మిళితమైనా యన్నాడు.

తరువాత కరతాళధ్వనులమధ్య అధ్యక్షుడు జిన్నా ఉపన్యాసం ప్రారంభమయింది. బ్రిటీషుప్రభుత్వం ఏపార్టీ సహకారాన్ని కోరడంలేదని ఆక్షేపించాడు. రాజకీయసమస్యను పరిష్కరించకుండా యుద్ధాన్ని గెలవడం అసంభవమని వేవెల్ వైస్రాయికి జవాబు చెప్పాడు. 'బ్రిటీష్ సామ్రాజ్యానికి శ్రాద్ధం పెట్టడానికి నేను ప్రధానమంత్రిని కాలేదు.' అన్ని డప్పాలుకొట్టిన చర్చిల్‌ను విమర్శించాడు. "మీకు యిష్టమున్నా లేకపోయినా బ్రిటిషు సామ్రాజ్యంమాత్రం వుండదు" అని సవాలుచేశాడు. భారతస్వాతంత్ర్యం లేకుండా పాకిస్థాన్ రాదని స్పష్టపరిచాడు. పాకిస్థాన్ సంపాదించడమంటే హిందువులకు కూడా స్వాతంత్ర్యం సంపాదించడమేనని తేటతెల్లంచేశాడు.

కాని వీటిని సాధించడానికి మార్గాన్ని జిన్నా ఉపన్యాసంగాని, లీగ్ తీర్మానాలుగాని సూచించడంలేదు. రాజకీయప్రతిష్టంభన తొలగించడానికి భారతస్వాతంత్ర్యాన్ని, ముస్లిం ప్రజలకు స్వయంనిర్ణయహక్కును బ్రిటీషు సామ్రాజ్యవాదుల చేతుల్లోనుంచి గుంజుకోడానికి, కాంగ్రెసునాయకుల విడుదల అవసరం. అందుకొరకు పనిచేయడానికి జిన్నా సిద్ధపడటంలేదు. అగస్టు తీర్మానాన్ని ఉపసంహరించుకుంటే గాంధీయే బయటికి రాగలడు. అలా చేయకపోవడానికి కారణం, లీగుతో సంబంధం లేకుండానే ఒత్తిడితెచ్చి బ్రిటీషువాళ్ళతో కాంగ్రెసు రాజీపడాలనే ఉద్దేశ్యమే అనే భయాన్ని జిన్నా కనబరచాడు. అధికారమిస్తే లీగు ప్రభుత్వంతో సహకారం చేయడానికి సిద్ధంగా వుంది. కాని బ్రిటీషు ప్రభుత్వం నిరాకరించి వినాశకరమైన పాలసీని అనుసరించుతూందని అధిక్షేపించాడు. "కమ్యూనిస్టులు లీగ్ - కాంగ్రెసు ఐక్యత కావాలంటున్నారు, బాగానేవుంది! కాని ఏషరతులపైన రాజీ?" అని జిన్నా ప్రశ్నించాడు. భారత స్వాతంత్ర్యం, ముస్లింజాతుల స్వయం నిర్ణయహక్కు — యివే జాతీయైక్యతకు పునాది. అదొకటే మార్గమని కమ్యూనిస్టు పార్టీ ఘోషించుతోంది. ఇందుకు అవసరమైన కాంగ్రెసునాయకుల విడుదలకొరకు లీగ్ దేశభక్తులు కృషిచేయాలసివుంది. జిన్నా, లీగ్ నాయకులు, సందేహాలు - అనుమానాలు పెట్టుకొని ముందంజ వేయ నిరాకరించుతున్నారు.

బెంగాల్ కరువు సమస్య

లీగ్‌నాయకులు బెంగాల్ కరువు పరిష్కారం విషయములో కూడ మార్గాన్ని చూపలేదు. ఆకలితో మాడిపోతున్న బెంగాలులో అధిక సంఖ్యాకులు ముస్లిం ప్రజాసామాన్యం. రాష్ట్రం పరిపాలనచేస్తూంది లీగ్ మంత్రివర్గం. తమకు సరిపోగా అదనం ఆహార పదార్థాలు కలిగివున్న సింధు, పంజాబులలో ముస్లింలీగ్ మంత్రివర్గాలున్నాయి. లీగ్ నాయకత్వం చొరవతీసికొని తిండిదొంగలనుఅరికట్టడానికి, ఆహారపదార్థాల కంట్రోలు, రేషనింగ్‌కొరకు సరియైన కార్యక్రమమిస్తే బెంగాల్ కరువును తీర్చడానికి మార్గం చూపగల్గేది. లీగ్ మహాసభ అలాంటిదేమీ చేయలేదు. నామమాత్రంగా అన్ని జీవితావసరాలను కంట్రోలు చేయాలని తీర్మానంచేసి తప్పుకొంది. పైగా ఇండియా ప్రభుత్వ కంట్రోలు ప్లానుకు అటంకాలు పెడుతున్న లీగ్ మంత్రులను ఒకవిధంగా సమర్థించింది. రాష్ట్రమంత్రుల అధికారాలలో జోక్యం కల్గించు కొంటూందని కేంద్ర ప్రభుత్వాన్ని ఆక్షేపించింది. లక్షల కొలది ప్రజలు ఆకలితో అల్లాడిపోతూంటే 'కంట్రోలు, రేషనింగులను వ్యతిరేకించే' వారిని ఈవిధంగా సమర్థించడంకంటే ఘోరం వుండబోదు.

కలకత్తాపైన, చిటగాంగుపైన జపాను దుండగీడులు బాంబులను వర్షించుతున్నారు. ఈ విషయమై లీగ్ సమాలోచనలలో చర్చే రాలేదు. అనగా లీగ్ నాయకత్వం దేశాన్ని ఎదుర్కొంటున్న ముఖ్య విషయాలలో దేని పరిష్కారంకొరకు ముందంజ వేయలేదు. రాజకీయ ప్రతిష్టంభన తొలగించడానికి కాంగ్రెసు నాయకుల విడుదలకై కృషిచేయడానికి పూనుకోలేదు. తిండిదొంగలు, నిల్వ వ్యాపారస్తులకు లొంగిపోయిన మంత్రివర్గాలను ఆ బురదనుండి పైకి లాగడానికి ప్రయత్నించలేదు: అనగా ఆహార సమస్యను పరిష్కరించడానికి దోవ జూపలేదు.

కాని లీగ్ మహాసభ ఉపన్యాసాలను, తీర్మానాలనుబట్టి చూస్తే ఒకటిమాత్రం బోధపడుతుంది. నాయకులు పదేపదే తాము స్వాతంత్ర్యాన్ని కోరుతున్నామని సామ్రాజ్య వ్యతిరేకతను తెల్పారు. తాము యెల్లపుడు ఐక్యతకు సిద్ధంగానే వున్నామని కాంగ్రెసే కలసిరావడం లేదని చెప్పుకొన్నారు. లీగ్‌లో సామ్రాజ్య వ్యతిరేకశక్తులు, ఐక్యతకోరేవారు బలపడుతున్నారనడానికి ఇది చిహ్నం.

మద్దుకూరి చంద్రశేఖరరావు

హిందూ మహాసభ

అఖిలభారత హిందూమహాసభ 25వవార్షిక సమావేశం అమృతసర్‌లో జరిగింది. అధ్యక్షుడుగా ఎన్నుకోబడిన సావర్కారుకు జబ్బుగా వుండుటచే డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అధ్యక్షత వహించాడు. మత విభేదాలనే వంకతో భారత స్వాతంత్ర్యానికి అడ్డుపెడుతున్న బ్రిటిషు ప్రభుత్వాన్ని తీవ్రంగా ఆక్షేపించాడు. ఐక్యత అనేపేరుతో కాంగ్రెసు ముస్లిముల కోర్కెలకు లొంగిపోతూందనీ, బ్రిటిషు ప్రభుత్వం అంతకంటే పెద్ద ఆశజూపి ఐకమత్యం రాకుండా చేస్తూందనీ అన్నాడు. పాకిస్థాన్ అసంభవమని ప్రభుత్వానికికూడా తెలుసును. ఐనా ముస్లిములందరి ప్రతినిధిగా ప్రభుత్వంచే గుర్తించబడిన లీగ్ దేశాన్ని ముక్కచెక్కలు చేయాలని కోరుతూందని విమర్శించాడు. మూడవ పార్టీ (బ్రిటను) పోతే మత విభేదాలు వాటంతటవే తొలగిపోతాయన్నాడు.

మహాసభతోపాటు 26 వ తేదీన జరిగిన జూబిలీ ఉత్సవంలో 50 వేలమంది పాల్గొన్నారు. గోకుల్‌చంద్ నారంగ్ అధ్యక్షత వహించాడు. వీరు తమ ఉపన్యాసంలో రాజకీయ ఖయిదీలను విడుదలచేయాలన్నారు. పాకిస్థానును వ్యతిరేకించుతూ యిప్పటికే పంజాబులో పాకిస్థాన అమలుజరుగుతోందని ఆక్షేపించాడు.

హిందూమహాసభ ఒకటే హిందువుల తరఫున వ్యవహరించగలదనీ, మహాసభ అంగీకారంలేకుండా జరిగిన ఏ ఒడంబడిక కూడ హిందువులను బద్ధుల్నిచేయజాలదని తీర్మానించారు. భారతదేశాన్ని చీల్చడానికి తాము వ్యతిరేకమనీ, పాకిస్థానును అన్నివిధాలా ఎదుర్కొంటామనీ తీర్మానించారు. ముస్లిం మంత్రివర్గాలున్న రాష్ట్రాలలో హిందువులకు అన్యాయం జరుగుతూందనీ, దీనిని విచారించి రిపోర్టు తయారుచేయడానికి ఒక విచారణ సంఘాన్ని నియమించారు. బెంగాల్ కరువు బాధ్యత అంతా లీగ్‌మంత్రివర్గంపై వేసి సంతృప్తిపడ్డారు.

మహాసభనాయకుల ఉపన్యాసాలు, తీర్మానాలు ఏమి సూచించుతున్నాయి. స్వాతంత్ర్యమివ్వనందుకు బ్రిటిషు ప్రభుత్వాన్ని తిట్టింది. కాంగ్రెసు ముస్లింలీగుకు లొంగిపోకుండా కాపాడటానికే తాము బద్ధకంకణులమయ్యామని చెప్పుకొంది. పాకిస్థానును అన్నివిధాలా ఎదురించుతామని లీగుపై మీసాలు దువ్వింది. కాంగ్రెసుమంత్రుల పరిపాలనక్రింద ముస్లింలకన్యాయం జరుగుతోందని లీగ్ ఆందోళన బయలుదేరతీసినట్లే, నేడుహిందూమహాసభ లీగ్‌మంత్రివర్గాలక్రింద హిందువులకు అన్యాయం జరుగుతూందని ఆందోళన లేవతీయబోతూంది. అనగా లీగుతో పోరాటానికి, దేశంలో విభేదాలను మరింత రెచ్చగొట్టడానికి, సన్నాహాలు చేస్తూంది. విభేదాలను రెచ్చగొడుతూ, వాటిని సాకుగాచూపుతూ, స్వాతంత్ర్యానికి ఆటంకాలు పెండుతూందని బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎందుకయితే ఆక్షేపించుతూందో, ఆ పనినే హిందూమహాసభ కార్యక్రమంకూడ నెరవేర్చుతూంది. అందుచే బ్రిటిషు ప్రభుత్వం పైతిట్లు తిట్లుగామాత్రమేవుండిపోతుంది, హిందూ-ముస్లిం విభేదాలను ఆచరణలో రెచ్చగొట్టడానికి మహాసభపాలసీ వినియోగపడుతుంది.

ప్రస్తుతం దేశాన్నంతను ఆవరించిన ఆకలిమంటలను తీర్చడానికి మహాసభ ఎట్టి కార్యక్రమాన్ని యివ్వలేదు. ప్రజాసామాన్యానికంతటికి ఆహారం అందజేయడానికి ధరల కంట్రోలు, రేషనింగ్, అవుసరమని తెలుపలేదు. లీగ్ మంత్రివర్గాలలోవున్న హిందూ మంత్రులుకూడ సభకు వచ్చారు. వారికి మహాసభ నాయకత్వం ఎట్టి సూచనా యివ్వలేదు. మహాసభనాయకులు ఆచరణలో, ప్రభుత్వం తలపెట్టిన కంట్రోలు, రేషనింగ్ స్కీమును, వ్యతిరేకించుతున్నారు. ప్రజాక్షేమానికి విరుద్ధమైన యీపాలసీని మహాసభ ఆక్షేపించనైనాలేదు. కాంగ్రెసునాయకులవిడుదలను కోరుతూ తీర్మానించిందిగదా! లీగ్‌కంటే మెరుగేనని వాదన కొందరు తేవచ్చు. కాంగ్రెసు అభిమానులైన హిందూ ప్రజలు ఆ తీర్మానం చేయనిచో సహించరు. కాంగ్రెసు అభిమానులను హిందూమహాసభలోకి ఆకర్షించడానికి, ముస్లింలీగ్ వ్యతిరేక కార్యక్రమంలోని వారిని (తరువాయి 2 వ పేజీలో)

బుధవారం ప్రజాశక్తి 5-1-44

1943 - 1944

మరోసంవత్సరం — ఈయుద్ధకాండలో నాలుగోసంవత్సరం—కాలవాహినిలో కలసిపోయింది. నాలుగేళ్ళక్రితం రేగిన యుద్ధజ్వాల 1943 లో తీవ్రతరవాయి. జయాపజయాలను నిర్ణయించగల స్థాయికి వచ్చింది. నానాటికి ఎక్కువ భూభాగాన్ని తన యినుపపాదాలకింద అణగదొక్కుతూ; ఇంకా ఎక్కువ జనసముదాయాన్ని నెత్తురుటేరులలో ముంచెత్తుతూ, అంతవరకు ముందుకుసాగిన నాజీరాకాసికి అట కట్టయింది. కథ అడ్డం తిరిగింది. స్టాలిన్‌గ్రాడ్‌తో ప్రారంభమయిన ప్రజాపక్ష విజయపరంపర అన్నిరంగాల్లోను శతృమూకల్ని వెనక్కి తరుముసాగింది.

ఉత్తరాఫ్రికా విముక్తిపొందింది. ఇటలీ దండయాత్ర ప్రారంభంతో ఫాసిస్టు సైన్యరాజ్య వ్యూహంభగ్న మయింది. రెడార్మీ సమ్మెట పోటులకు నాజీమిలిటరీబలం చిన్నాభిన్నమయింది. త్వరలోనే యావత్తుసోవియట్ భూభాగం శత్రునిశ్శేషం కాగలదు. ప్రజాపక్షవిజయం ఖాయమయింది. 1943 కి వీడ్కోలు చెబుతూ, సోవియట్ అధ్యక్షుడు కాలినిన్ ఈ విషయాన్నే స్పష్టపరిచాడు.

"గడచిపోయిన సంవత్సరం యుద్ధరంగంలో ప్రధానమైన మార్పులను తెచ్చింది. నాజీలు ఆక్రమించుకొన్న సోవియట్ ప్రదేశంలో మూడింట రెండువంతులు విముక్తిపొందింది.... ఈనాడు నాజీలు యూరప్ ఐశ్వర్యాన్నిగురించి. బాకు చమురు గనులను గురించి కలలుగనడంలేదు. ఎక్కడికక్కడ వెనక్కితగ్గి. యుద్ధరంగాన్ని చిన్నదిగ చేసుకోవడం ఎలా అనేదే ఈనాడు నాజీల ఆలోచన—రెడార్మీ దండయాత్రతోపాటు మన మిత్రసేనలుకూడ 1943 లో ఫాసిస్టుసేనలమీద ఎడతెగని ఒత్తిడి తెచ్చాయి. ఈ సమిష్టి ప్రతిఘటన ఫలితంగా మిత్రరాజ్యాలమధ్య చక్కని సామరస్యం కుదిరింది. టెహరాన్ నిజంగా ఒక అమోఘ చారిత్రకఘటన"

1943 ప్రాముఖ్యం యింతేకాదు. 'స్వాతంత్ర్య సమరంలో ప్రజలు ఏకముఖంగా నిలవగలిగిననాడు వారి ఆశయసిద్ధిని ఏశక్తికూడ ఆటంక పరచలేదు' అనే దివ్య సందేశాన్ని నిదర్శన పూర్వకంగా 1943 రుజువుచేసింది. మొదటి నిదర్శనం ఫ్రెంచి జాతీయోద్యము. ఫ్రెంచి జాతీయోద్యమాన్ని తమ కనుకూలమయేవిధంగా అమర్చుకోడానికి బ్రిటిష్. అమెరికన్ సామ్రాజ్యవాదులు ఎత్తుగడలు వేశారు. ఫ్రెంచి స్వాతంత్ర్య శక్తులన్నీ నాయకునిగా పరిగణిస్తున్న డీగాల్‌ని వెనక్కునెట్టజూచారు. ఈ పన్నాగాలను ఫ్రెంచి జాతీయ శక్తులన్నీ ఏకముఖంగా ప్రతిఘటించాయి. సామ్రాజ్యవాదులు లొంగిరాక తప్పిందికాదు. ఈనాడు ఫ్రెంచి స్వాతంత్ర్యోద్యమం డీగాల్ నాయకత్వాన నానాటికి బలపడుతూంది.

రెండవనిదర్శనం లెబనాన్ ప్రజావిజయం. ఫ్రెంచి జాతీయసంఘంలోని సామ్రాజ్యవాదులు లెబనాన్ స్వాతంత్ర్యాన్ని అరికట్టజూచారు. తమ పవిత్ర జన్మహక్కును కాపాడుకోడానికి లెబనాన్ ప్రజానీకమంతా. అన్ని వర్గాలవారు. అన్ని మతాలవారు - ఏకముఖంగా నిలిచారు. సంపూర్ణస్వాతంత్ర్యాన్ని గుంజుకున్నారు.

మూడవ నిదర్శనం యుగోస్లావియా. ఓడింపబడి. నిరాయుధం చేయబడ్డ దేశం యుగోస్లావియా. అంతవరకు అధికారం చలాయించిన ప్రభుత్వం దేశంలోని వివిధజాతులమధ్య తీవ్రమైన విభేదాలను రెచ్చగొట్టి. విడిచిపోయింది. నాజీలుకూడా ఆచీలికలనే ఉపయోగించుకోజూచారు. ఈ పన్నాగాలను ఎదుర్కొని. యావత్ ప్రజానీకాన్ని సంఘటితపరచి. నేటి యుగోస్లావియానాయకుడు స్వాతంత్ర్య పోరాటాన్ని జయప్రదంగా కొనసాగిస్తున్నారు. ఎక్కడిది వీరికీబలం? చీలకలైపోయిన ప్రజల్ని కూడగట్టడానికి వీరుపయోగించిన దివ్యాస్త్రమేది? జాతుల స్వయంనిర్ణయ సూత్రమే ఆ అమోఘసాధనము. పరాజిత ప్రజానీకాన్ని కూడా ఒక అజేయశక్తిగా మార్చగలిగిందా సాధనము. దీనిద్వారా చేకూరిన బలంతో యుగోస్లావియాప్రజలు వెనుకటి నిరంకుశ ప్రభుత్వవర్గాన్ని తృణీకరించగలిగారు. ప్రజాప్రభుత్వానికి బీజం వేయగలిగారు.

ఫ్రాన్సు. యుగోస్లావియా, లెబనాన్ ఈ మూడు ఉదంతాలు యూరపులో యుద్ధానంతరం యేర్పడగల నూతన వ్యవస్థలకు నిదర్శనాలు. చరిత్రలో కని విని యెరుగని త్యాగదీక్షతో రెడార్మీ యీ మార్పులకు చేయూతనిస్తూంది. ఈ పరిణామ బలమే రెండోరంగాన్ని త్వరితం చేసితీరుతూంది. 1944 తో యూరపులో నూతన యుగం ప్రారంభం కాగలదు.

యూరపులో నాజీల నాటకం అంతం కాబోతూంది. దానితో పసిఫిక్కులో జపానుపని పట్టడం ప్రారంభం కాగలదు. చైనా అంతిమవిజయ సాధనకు సిద్ధపడుతూంది. పసిఫిక్కురంగానికి ముఖ్య కేంద్రమయిన మనదేశం సంగతేమిటి?

ఇన్ని యేండ్లుగ మనలను బానిసత్వపు సంకెళ్ళతో మగ్గజేసింది మనలోని అనైక్యత. 1943 లో ఈ అనైక్యత లక్షలాది అమాయక ప్రజల్ని బలిగొంది. ఒకరిపై నొకరు కక్షలు సాధించుకోవడంకోసం. బెంగాలులో హిందూ మహాసభ, ముస్లింలీగ్ నాయకులు లక్షలకొలది ప్రజల్ని ఆకలిమంటలకు ఆహుతిచేశారు. ఊహించడానికయినా శక్యంకాని నరకయాతనల్ని అనుభవించారు బెంగాల్‌సోదరులు. ఆ బాధలకు తోడయాయి జపాను కిరాతుల బాంబులు. ఈ బాధల నివారించడానికయినా అక్కడి ముస్లింలీగ్, హిందూ మహాసభ, కాంగ్రెసు నాయకులు, యేకం కాలేదు. ఒకరిమీద ఒకరు కత్తి నూరుతూనేవున్నారు. ఈ అనైక్యత పుణ్యమా అంటూ జాతీయ నాయకులు యింకా జైళ్ళలో మగ్గుతూనేవున్నారు. ఈ విషాదకర పరిస్థితుల్ని చూచి దేశభక్తులు గుండె దిగజార్చుకుంటున్నారు. పరిస్థితులు తన కనుకూలంగా వున్నాయికదా అని, దేశద్రోహి బోసు 'ఇదిగో వస్తాన్, అదిగో వస్తాన్' అని రంకెలువేస్తున్నాడు. ఈ అంధకారంలోంచి బయటికి దారిలేదా?

ఉంది. దేశంపట్ల, ప్రజలపట్ల, తమ బాధ్యతలను విస్మరించి పెద్దలు ఒకరిపై నొకరు కత్తులు నూరుకొంటున్న నిమిషంలోనే - ప్రజాసామాన్యం జీవన్మరణ సమస్యల నెదుర్కొంటూ యేకమవుతున్నారు. స్వార్థరహిత ప్రజాసేవకుల కృషి ఫలితంగా, ప్రజాసంస్థల నాయకత్వంక్రింద కోట్లకొలది ప్రజాసామాన్యం సంఘటితమవుతూంది. ఇదే మనకు ఆశాకిరణం. జాతీయైక్యతను చేకూర్చి. జాతీయ నాయకులను విడిపించి, దేశరక్షణకు జాతీయ ప్రభుత్వాన్ని ప్రసాదించగల దీ శక్తే.

సర్వశక్తులను వినియోగించి 1944 లో ఈ ప్రజాశక్తిని బలపరచుకొందాం. రానున్న ప్రపంచ ప్రజాస్వామిక వ్యవస్థలో భారత దేశానికి అర్హస్థానాన్ని సంపాదించుకొందాం.

(1 వ పేజీ తరువాయి) యీడ్వటానికి, యిది ఒక ఎత్తుమాత్రమే. ఏమంటే కాంగ్రెసు నాయకులను విడిపించుకోడానికి నేడు ఒకటే మార్గముంది. అదే జాతీయైక్యత. ఐక్యతకు వ్యతిరేకంగా హిందూ - ముస్లిం తగాదాలను రెచ్చగొట్టడానికి ప్రయత్నించేవారు కాంగ్రెసు నాయకుల విడుదల కోరుతున్నామనడం వట్టిదగా, లేదా చొల్లుకబుర్లుమాత్రమే.

లిబరల్స్ మహాసభ

బొంబాయిలో 29 వ తేదీన మితవాదుల మహాసభ జరిగింది. సర్ మహారాజాసింగ్ అధ్యక్షత వహించాడు. ఈయన తన ఉపన్యాసంలో, ప్రస్తుతరాజకీయప్రతిష్టంభనఇలాగే యుద్ధానంతరంవరకు కొనసాగించాలనిబ్రిటీష్ ప్రభుత్వం కోరుతుందన్నాడు. మనం ఆప్రతిష్టంభనను తొలగించడానికి కృషి చేయాలన్నాడు. రాజగోపాలాచారి, ఫిలిప్స్‌లాంటి బాధ్యతగల రాజకీయవేత్తలకు గాంధీజీని కలసికోడానికి అవకాశం ఇవ్వనందుకు ప్రభుత్వాన్ని ఖండించాడు. కాంగ్రెసునాయకులు ఫాసిస్టు వ్యతిరేకతను విడనాడారంటేనూ, జపాను సామ్రాజ్యవాదులతో సంధిచేసికోదలిచారంటేనూ తాను విశ్వసించనన్నాడు. తాము భారత దేశమంతా ఒకే ప్రభుత్వంక్రింద వుండాలని కోరుతామన్నాడు. కోట్లకొలది ముస్లిం ప్రజలలో పలుకుబడివున్న లీగ్ ఒకే ప్రభుత్వ సూత్రాన్ని వ్యతిరేకించుతూంది. దానిని తోసిపుచ్చడం సాధ్యకాదన్నాడు.

ఈయన లీగ్ ప్రాముఖ్యతను గుర్తించాడు. కాని పాకిస్థాన్‌కు అనుకూలంగాకాని వ్యతిరేకంగాకాని యుద్ధం జరుగుతుండగా పోరాడటం అల్లకల్లోలానికి దారితీస్తుందని వాపోతున్నాడు. అందుచే వాయిదా వేయాలంటున్నాడు. అసలు ముస్లిం జాతులకు స్వయంనిర్ణయ హక్కు యివ్వటద్వారానే వారిలో విశ్వాసం కలుగజేయగలమని మితవాదులుగాని, హిందూనాయకులుగాని. గుర్తించుటలేదు. స్వతంత్రంకొరకు, స్వయంనిర్ణయ హక్కుకొరకు. దేశరక్షణకొరకు, నిర్మించిన జాతుల, ప్రజల, ఐకమత్యంద్వారానే మనం బ్రిటిషు ప్రభుత్వాన్నుంచి అధికారాన్ని గుంజుకోగలమని వారు గ్రహించడంలేదు. స్వాతంత్ర్యంకొరకు, దేశ రక్షణకొరకు, ఐకమత్యముతో కృషిచేసిన ప్రజలు, తాము కష్టించి సాధించిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోటానికే కలిసివుంటారు. ప్రజలపై విశ్వాసముంచి, పనిచేస్తే యీ సత్యం సులభంగానే అర్థమవుతుంది.

మితవాదుల మహాసభ కాంగ్రెసు నాయకులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. అగస్టు తీర్మానం రద్దయినట్లుగా ఎంచమని కాంగ్రెసువాదులను కోరింది. రాష్ట్రాలలోను, కేంద్రంలోనూకూడ సంయుక్త మంత్రివర్గాలను ఏర్పరచాలని స్పష్టపరచింది. ఐక్యత కావాలని కోరిందిగాని, ముస్లింలలో వున్న సందేహాలను తొలగించడానికి స్వయంనిర్ణయ హక్కు గుర్తించడమే మార్గమనేది గ్రహించలేదు. అందుచే యుద్ధానంతరంవరకు పాకిస్థాన్ విషయం వాయిదా వేయమంది. జాతీయైక్యతకు, సంయుక్త మంత్రివర్గాలేర్పడటానికి, ముస్లిం జాతుల స్వయంనిర్ణయహక్కు గుర్తించడం అవసరమని తెలిసికోలేదు.

తరువాత ఆహారసమస్య విషయమై ముఖ్యమైన తీర్మానం చేసింది. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు ప్రవేశపెట్టి పంటలను వృద్ధిచేయాలంది. పట్టణాలలోనైనా ఇంగ్లండులోవలె రేషనింగు అమలు జరుపాలంది. పిల్లలకు పాలు, ప్రజాసామాన్యానికి ఆహారం, అందజేయడం ప్రభుత్వ ధర్మమన్నారు. కేంద్రప్రభుత్వం సూచించిన కంట్రోలు స్కీమును కొన్ని రాష్ట్రప్రభుత్వాలు వ్యతిరేకించుతున్నందుకు ఆక్షేపించింది. కేంద్రప్రభుత్వం కంట్రోలు స్కీమును అమలుజరుపాలని కోరింది.

ఆహారసమస్యలో మితవాదుల మహాసభ ఉచితజ్ఞతను ప్రదర్శించింది. కాని కంట్రోలు స్కీమును జయప్రదంగా అమలుజరుపడానికి అవసరమైన ప్రజాబలం సంపాదించడానికి, మార్గంచూపలేదు. అవును: ప్రజలతో సంబంధం కోల్పోయిన మితవాదులకేమి తోస్తుందా విషయం.

కాంగ్రెసువాదుల నిస్పృహ

సుప్రసిద్ధ కాంగ్రెసు పత్రిక అయిన కృష్ణాపత్రిక (జనవరి 1 వ తేదీ) సంపాదకీయం, డిసెంబరు ఆఖరువారంలో జరిగిన మహాసభలను పర్యాలోకించింది. వివిధసభలు కాంగ్రెసు నాయకులను విడుదల చేయాలని కోరాయిగాని, వీటివలన బ్రిటిషు మంత్రులు లొంగివస్తారా? అని నిస్పృహ వెల్లడించుతోంది. "వారిని వదలండి, వీరిని వదలండి అని మనం మొరలిడడం అప్రస్తుతం. కాంగ్రెసు ప్రముఖులు వీరినెవరిని అర్థించడం లేదు తమను విడిపించమని" అని వ్రాసింది. కాంగ్రెసు వాదులలో నేడు వ్యాపించివున్న నిస్పృహకు యిది చక్కని ఉదాహరణ.

కాంగ్రెసు నాయకులు అర్థించ నక్కరలేదు. తమ నాయకులను విడిపించుకొనుట ప్రజల విధి. కృష్ణాపత్రికే వ్రాసినటుల "భారత ప్రజలు - నలుబది కోట్లు భారత సంతానం. భారతదేశం ప్రజలది. భారత పుత్రులది." అట్టి భారత దేశాన్ని నేడు కరువు పీడించుతోంది. భారత ప్రజలు ఆకలిమంటలకు, అంటువ్యాధులకు ఆహుతి అవుతున్నారు. ఈ దేశాన్ని, యీ ప్రజలను రక్షించుకోడానికి, ఆకలి మంటలను చల్లార్చడానికి కాంగ్రెసు నాయకులు బయటికి రావాలని ప్రజలు కోరుతున్నారు. వివిధ పార్టీలు అందుకు కృషిచేయాలని ఒత్తిడి తెస్తున్నారు. బయట పార్టీలన్నీ కలిసి కాంగ్రెసు నాయకులను విడిపించాలని కోరుతున్నారు. అన్ని పార్టీల ప్రతినిధులతో కూడిన మంత్రివర్గాలు, జాతీయ ప్రభుత్వం యేర్పడి, దేశరక్షణ, కరువు నివారణచేయాలని వారు అభిలషించుతున్నారు. ఈ అభిలాషే డిశంబరులో జరిగిన వివిధ మహాసభల ఉపన్యాసాలు, తీర్మానాలలో ద్యోతకమవుతోంది.

నిస్పృహ విజయానికి మార్గంకాదు. ఆత్మవిశ్వాసంతో కార్యాచరణకు దిగితే తప్పక జయించి తీరుతాము.

జిల్లా మహిళా ఉద్యమ చరిత్రలో నూతన ఘట్టం

పశ్చిమ గోదావరిజిల్లా ద్వితీయ మహిళా మహాసభ

పశ్చిమగోదావరిజిల్లా మహిళా సంఘం 1938 లో స్థాపించబడింది. అప్పటినుండి, స్త్రీలలో ఘోషాపద్ధతి పోవాలనీ: గ్రామాలలో స్త్రీలకు ప్రత్యేకమైన మరుగుదొడ్లు కట్టించాలనీ; శిక్షణపొందిన మంత్రసానులు ప్రతి గ్రామంలోను ఉండాలనీ; ఆందోళనచేసింది. స్త్రీల ఆస్తిహక్కువిషయంలోను, వివాహ పద్ధతి విషయంలోను, రావు కమిటీకి సూచనలిస్తూ 4000 సంతకాలతో ప్రభుత్వానికి మహజర్లు పెట్టించింది. ఇందుకై జిల్లా కలెక్టరువద్దకు రాయబారం పంపించింది. 1940 లో వెల్లూరు డిటెన్యూలు నిరశనవ్రతం చేస్తూన్నప్పుడు, వారివిడుదలకై 10 గ్రామాల నుండి ప్రభుత్వానికి టెలిగ్రాము లిప్పించింది. సబ్‌కలెక్టరువద్దకు రాయబారం వెళ్ళింది.

ఈఆందోళన జిల్లా మహిళలలో అధికసంచలనం కలుగజేసింది. ప్రస్తుతం జిల్లా మహిళా సంఘంలో 2400 మంది సభ్యురాండ్రు ఉన్నారు. 30 గ్రామాలలో గ్రామకమిటీలు ఏర్పడ్డాయి. 3 గ్రామాలలో మహిళల విజ్ఞానాభివృద్ధికి క్లాసులు నడుపబడ్డాయి.

మహాసభకు ఏర్పాట్లు

ఐనా, చేయవలసింది ఇంకా ఎంతోఉంది. మహిళా ఉద్యమాన్ని జిల్లా అంతటా ఒక ప్రజా ఉద్యమంగా అభివృద్ధిచేయాలి. ఇందుకై మొన్న 24, 25 తేదీలలో, భీమవరం తాలూకా నౌడూరు గ్రామంలో రెండవ జిల్లామహిళామహాసభ జరిగింది. ఇందుకయే ఖర్చులకుగాను, జిల్లాసంఘం తరపున రు. 1100 వసూలుచేయబడ్డాయి. మొగల్తుర్రు జమీందారుగారి కుమార్తె జిల్లాసంఘం గావించే కృషికి మెచ్చుకొని రు. 15 విరాళమిచ్చారు. 60, 70 యేండ్ల స్త్రీలుసహితం రు. 1, 0-8-0, 0-4-0 చొప్పున విరాళాలిచ్చారు. కాంగ్రెసు ఉద్యమంలో రెండుమూడుసార్లు జైలుకువెళ్ళివచ్చిన శ్రీ దాట్ల నీలాద్రిరాజుగారు (70 ఏండ్ల వృద్ధు) మహాసభకు రు. 116 యిచ్చారు. "యూనిస్ సభామందిరం" అనే పేరుతో, గ్రామస్తులంతాకలిసి విశాలమైన పందిరి ఒకటి వేయించారు.

చింతలపూడి, పోలవరం తాలూకాలుతప్ప, మిగతా అన్ని తాలూకాలనుండి 107 గురు ప్రతినిధులు, యితర జిల్లాలనుండి 10 మంది సౌహార్ద్రప్రతినిధులు వచ్చారు. పడవలమీద, బళ్ళమీద, ప్రయాణంచేసి 800 మంది స్త్రీలు ప్రేక్షకులుగా వచ్చారు.

ఎవరెవరు వచ్చారు?

ప్రతినిధులలో 40 మొదలు 60 సంవత్సరాల వయస్సు గలవారు 9 గురు ఉన్నారు. ప్రస్తుతం జైళ్ళలో డిటెన్యూలుగా గాని, శిక్ష విధించబడిన రాజకీయఖైదీలుగా గాని, ఉన్నవారి భార్యలు 6 గురు ప్రతినిధివర్గంలో ఉన్నారు. వీరు గాక, 5 గురు మ్యునిసిపల్ కార్మికస్త్రీలు, ఇద్దరు వ్యవసాయకూలీస్త్రీలు, యిద్దరు ముస్లింస్త్రీలు, కూడా ప్రతినిధులుగా వచ్చారు.

మహాసభను స్వయంగాచూడ్డానికి, జిల్లాలో ప్రముఖ కాంగ్రెసువాదులైన దాట్ల నీలాద్రిరాజుగారు, కుటుంబసమేతంగా వచ్చారు. దాట్ల తిరుపతిరాజుగారు, పసల కృష్ణమూర్తిగారు, కూడా ప్రేక్షకులుగా వచ్చారు. 1930 నుండి కాంగ్రెసు ఉద్యమాలకు తోడ్పడుతూ, ఇప్పుడు తణుకులో "సేవాసదనం" అను మహిళావిద్యాలయాన్ని నిర్వహిస్తూన్న దేవులపల్లి సత్యవతమ్మగారు సౌహార్ద్రప్రతినిధిగా వచ్చారు. అగస్టు ఘటనల సందర్భంలో 2 సంవత్సరాల శిక్ష ననుభవిస్తూన్న భూపతిరాజు సుబ్బతాతరాజుగారి భార్య మహాసభలో వాలంటీరుగా పనిచేశారు. ప్రతినిధులలో 32 రు. ప్రేక్షకులలో యించుమించు సగంమంది, ఘోషా అనే దురాచారానికి గురియైన స్త్రీలే.

ప్రతినిధుల సమావేశం

"కదలిరావాలి స్త్రీలు కదలిరావాలి
బానిసవిముక్తికొరకు స్త్రీలు బయలుదేరాలి"

అనే పాటతో 24 వ తేదీ మధ్యాహ్నం ప్రతినిధుల సమావేశం ప్రారంభమయింది. జిల్లా సంఘాధ్యక్షురాలైన భూపతిరాజు వెంకాయమ్మగారు సంఘంతరపున జరిగినపనిని గూర్చి రిపోర్టు యిచ్చారు. తరువాత ముఖ్యమైన కొన్ని తీర్మానాలు చర్చించబడి ఆమోదించబడ్డాయి.

1. స్త్రీలకు సమాన వారసత్వపు హక్కును, రెజిస్ట్రేషన్ వివాహ పద్ధతిని, విడాకుల హక్కును, గుర్తిస్తూ హిందూ లా సవరణ బిల్లు 1944 జూన్‌లోగా శాసనం చేయబడాలి.

2. ప్రతిగ్రామంలోను స్త్రీలకు మరుగుదొడ్లు, తరిఫీదుపొందిన మంత్రసానులు, బాలికాపాఠశాలలు, ఉండేటట్లు స్థానికసంస్థలు చర్యతీసుకోవాలి.

3. స్త్రీలచే గనులలో పనిచేయించరాదు. గ్రామాలలో స్త్రీలకు పురుషులతోబాటు సమానకూలి యివ్వాలి.

4. స్త్రీలు ఆరోగ్యకరమైన వంటపద్ధతు లవలంబించాలి.

5. మహిళాసంఘ ఆశయాలైన స్వాతంత్ర్యాన్ని, శాంతిని, అభ్యుదయాన్ని, మట్టిపాలు గావించనున్న ఫాసిస్టురాజ్యాలకు వ్యతిరేకంగా స్త్రీలు ప్రజాపక్షంలో చేరాలి. దేశాన్ని ఫాసిస్టు ప్రమాదంనుండి, కరువు రాక్షసినుండి, కాపాడుటకు అన్ని రాజకీయ పార్టీలు ఐక్యతతో జాతీయనాయకుల విడుదలకు, జాతీయప్రభుత్వస్థాపనకు పనిచేయాలి.

6. మద్రాసు ప్రభుత్వం మద్యపాన నిషేధ చట్టాన్ని తిరిగి అమలులోపెట్టాలి.

7. ఆహారం ప్రజలందరికీ సక్రమంగా అందజేయుటకు, ఫాసిస్టు ప్రమాదంనుండి తాము రక్షించుకోడానికీ, స్త్రీలు విరివిగా వాలంటీరు దళాలలో చేరాలి.

8. బాలబాలికలకు చక్కని శిక్షణ ఇవ్వడానికి స్త్రీలు బాలసంఘాల నిర్మాణానికి తోడ్పడాలి.

ఊరేగింపు, మహాసభ

25 వ తేదీ మధ్యాహ్నం 350 మంది స్త్రీలతో ఊరేగింపు జరిగింది.

"వీరమాతలను సంస్మరించుటకు
వేగమె స్త్రీలిక రారమ్మా!"

మొదలైన పాటలతోను, "స్వతంత్ర భారత్ కీ జై!" "ఫాసిజం నశించాలి!" "జాతీయ నాయకుల్ని విడుదలచేయాలి!" "మహిళాసంఘాలు వర్ధిల్లాలి!" "స్త్రీలకు వారసత్వపు హక్కుకావాలి!" "ఘోషా పద్ధతి నశించాలి!" మొదలైన నినాదాలతోను, గ్రామ వీధులన్నీ ప్రతిధ్వనించాయి.

ఊరేగింపు పూర్తిఅయాక, జిల్లాకాంగ్రెసు నాయకురాండ్రలో ఒకరైన శ్రీమతి ముల్పూరి చుక్కమ్మగారు "స్వాతంత్ర్యం, శాంతి, అభ్యుదయం" అని వ్రాయబడియున్న మహిళా పతాకాన్ని ప్రతిష్టించారు.

మధ్యాహ్నం 3 గంటలకు "యూనిస్ సభామందిరం" లో మహాసభ ప్రారంభమయింది. షుమారు 2400 మంది ప్రేక్షకులు క్రిక్కిరిసి కూచున్నారు. డాక్టరు అచ్చమాంబగారు ప్రారంభోపన్యాసం యిస్తూ, స్త్రీల ఆర్థిక బానిసత్వాన్ని గురించి, ఘోషావల్ల కలిగే హానిని గురించి, బాల్యవివాహాలవల్ల నష్టాన్నిగురించి, వివరించి చెప్పారు. వితంతువివాహాల ఆవశ్యకతను గురించి ఆమె చెబుతూంటే,

"ఈ విషయమై పూర్వం వీరేశలింగం పంతులుగారు చెప్పనేచెప్పారు!" అని ఒకరు,

మా విలేఖరి

"స్త్రీలు ముందుకొస్తూంటే, ఒద్దనేవారెవరుంటారు?" అని మరొకరు, అన్నారు.

అధ్యక్షోపన్యాసం

తరువాత, శ్రీమతి మాసకొండ సూర్యావతిగారు అధ్యక్షోపన్యాసం ప్రారంభించారు. ఫాసిస్టురాజ్యాలు ఏవిధంగా స్త్రీల నధోగతికి తీసుకుపోయాయో, వివరించారు. మనదేశానికి కూడా జపాన్ ప్రమాదం ఎంతదగ్గరలో ఉన్నదో తెలియజేశారు. బెంగాల్‌లో కరువు రాక్షసి వేలకొద్దీ స్త్రీపురుషులను పొట్టను బెట్టుకుంటూంటే, జపాన్ దాడిమొక్క ప్రమాదం ఎంత హెచ్చిందో స్పష్టీకరించారు. ఆహార సమస్యను పరిష్కరించడానికీ, దేశాన్ని ఫాసిజం నుండి రక్షించడానికీ, దేశభక్తులందరు—రాజకీయపార్టీలన్నీ, ఐక్యతతో జాతీయనాయకుల విడుదలకై పనిచేయవలసిందని ఉద్బోధించారు. కాంగ్రెసువాదులు ముస్లింలు కోరే స్వయంనిర్ణయ హక్కును గుర్తించి, కాంగ్రెసు — ముస్లింలీగ్ ఒడంబడికకు తోడ్పడవలసిందని హెచ్చరించారు.

తరువాత, దేవులపల్లి సత్యవతమ్మగారు, ముల్పూరు చుక్కమ్మగారు, స్త్రీల అభ్యున్నతికై కాంగ్రెసు గావించిన కృషిని సంస్మరించారు.

కొత్తసంవత్సరానికి శ్రీమతి సంకు లక్ష్మీకాంతంగారు జిల్లా సంఘాధ్యక్షురాలుగాను, పరకాల అహల్యగారు కార్యదర్శినిగాను, గోపరాజు సీతాదేవిగారు సహాయకార్యదర్శినిగాను ఎన్నుకోబడ్డారు. వీరుగాక కార్యనిర్వాహకవర్గానికి మరి 8 గురు సభ్యురాండ్రు ఎన్నుకోబడ్డారు.

ముగింపు

ఆనాటి మధ్యాహ్నం జరిగిన శిశు ప్రదర్శనంలో బరువునుబట్టి, ఆరోగ్యాన్నిబట్టి నలుగురు శిశువులకు బహుమతులీయబడ్డాయి. శ్రీ హరినారాయణశర్మగారి శిశువుకు మొదటి బహుమతి వచ్చింది.

అఖిలభారత మహిళాసభ స్టాండింగ్ కమిటీలో సభ్యురాలైన శ్రీమతి జాస్తి సీతామహలక్ష్మమ్మగారు సమిష్టిగానంలోను, వేషాలలోను, పాల్గొన్నవారికి బహుమతు లిచ్చారు. మహిళా లోకంలో వ్యాపించుతూన్న చైతన్యం చూచి, జిల్లామహిళాసంఘాన్ని ప్రశంసించారు.

రాత్రి 11 గంటలు మొదలు 2 గంటల వరకు, గుంటూరుజిల్లా మహిళాదళంవారు "టాన్యా" బుర్రకథచెప్పారు. ఆసోవియట్ వీరయువతిని నాజీలు పెట్టిన హింసలను కథలో వర్ణిస్తూంటే, 3500 మంది ప్రేక్షకులు ఫాసిస్టు విధానాన్ని అసహ్యించుకున్నారు.

ఈ మహాసభ పశ్చిమగోదావరిజిల్లా మహిళావుద్యమంలో ఒక నూతన ఘట్టం. జిల్లా మహిళలలో కలిగిన యీ సంచలనాన్ని ఆధారంగాగొని, మహిళాఉద్యమాన్ని జిల్లాలో ఒక ప్రజాఉద్యమంగా వ్యాపింపజేయాలను ఉత్సాహంతో ప్రతినిధులుతిరిగి వెళ్లారు.

★

కృష్ణాజిల్లాలో మహిళాసంఘ ప్రచారం

16-12-43 వ తేదీని కృష్ణాజిల్లా మహిళా సంఘ ఆర్గనైజరు వి. సీతమ్మగారు బందరు తాలూకా, చిన్నాపురం గ్రామంలో మహిళా సమావేశం జరిపి, స్త్రీల సాంఘిక—ఆర్థిక సమస్యలను గురించి విపులంగా ఉపన్యసించారు. 13 రు స్త్రీలు మహిళాసంఘంలో సభ్యులుగా చేరారు. మద్యపాననిషేధచట్టాన్ని రద్దుపరచిన ప్రభుత్వచర్య సమావేశంలో ఖండించబడింది.

20-12-43 వ తేదీని కైకలూరు తాలూకా, చిగురుకోట గ్రామంలో గ్రామ మహిళాసంఘ జనరల్‌బాడీ సమావేశం జరిగింది. "ప్రపంచ పరిస్థితులు-స్త్రీల కర్తవ్యం" అనే విషయాన్ని గురించి జానకిపాల్‌గారు ఉపన్యసించారు. కాంగ్రెసునాయకుల విడుదలనుగురించి, మద్యపాన నిషేధచట్టాన్ని ప్రభుత్వం రద్దు చేయడాన్ని గురించి, కిరసనాయిల్ సప్లయిని గురించి, బెంగాలు కరువును గురించి, సమావేశంలో తీర్మానాలు గావించబడ్డాయి. ఈ గ్రామంలో గ్రామ మహిళాసంఘం తరపున డిసెంబరు 2, 3 వారాలలో క్లాసులు నడుపబడ్డాయి. రాజకీయభూగోళం, యుద్ధ పరిస్థితులు, స్త్రీల సమస్యలు, మొదలయినవాటిని గురించి ప్రసంగాలు జరిగాయి. ఆగ్రామంలో 2 పార్టీలున్నప్పటికీ, క్లాసులకు ఉభయపార్టీల స్త్రీలు వచ్చారు.

దివి తాలూకాలో డిసెంబరు ఆఖరువారం 7 గ్రామాలలో శారదాంబగారు, ఈశ్వరమ్మగారు సభలు, సమావేశాలు జరిపి, స్త్రీలసమస్యలను గురించి ఉపన్యసించారు. మొత్తం 10 సభలకు షుమారు 150 మంది స్త్రీలు హాజరయ్యారు. హరిపురం, సాలెంపాలెం, నారాయిపాలెం గ్రామాలలో 120 మంది స్త్రీలు మహిళాసంఘంలో సభ్యురాండ్రుగా చేరారు.

గోదావరిడెల్టా రైతులు అవలంబించవలసిన వైఖరి

ఆంధ్రరాష్ట్రరైతుసంఘ ప్రధానకార్యదర్శి యీ క్రింది ప్రకటన గావిస్తున్నారు :—

దాళ్వాపంటకు గోదావరి నీటిని ఉపయోగించుకొనుటలో ఉభయగోదావరిజిల్లా వాసుల మధ్య తగాదాలు బయల్దేరుతున్నాయి. పి.డబ్లియు.డి. వారు అమలునందుంచిన ప్రపోర్షనేట్ డిశ్చార్జి పద్ధతిని రైతాంగం సరిగా అర్థముచేసుకున్నట్లయితే, వివాదాలకు కారణమే వుండదు.

1934 లో గోదావరిజిల్లాలోని దాళ్వాపంటకు రొటేషన్ పద్ధతిప్రకారం ఏరియాలు నిర్దేశించబడ్డాయి. అనగా, ఒక్కొక్క గ్రామాన్ని రెండు, లేక మూడు భాగాలుగా చేసి, ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క భాగానికి నీరు సప్లయిచేసేవారు. కాని, నిర్దేశించబడిన ఏరియాను మించి అదనంగా 40 వేల యకరాలకు నీరు యివ్వబడేది. 1941 లో ఈ పద్ధతికి బదులు ప్రపోర్షనేట్ డిశ్చార్జి పద్ధతి అమలులోకి వచ్చింది. అనగా, ఉభయ గోదావరి డెల్టాలకు సార్వాపంట భూములను బట్టి దాళ్వాపంట ఏరియాలను నిర్దేశించారు. ఈ ఏరియాల ననుసరించి దామాషాన నీటిని పంచిపెడతారు. ఈ పద్ధతిప్రకారం, నిర్దేశించబడిన ఏరియాకు సరిపోయే నీటినిమాత్రమే యిస్తారు. అదనపు సాగుకు నీరు చాలదు. ఇందువల్ల ప. గోదావరిజిల్లా రైతులందరూ నష్టపడవలసివస్తోంది. పశ్చిమగోదావరిరైతులు ఈవిషయంగ్రహించలేక, తమకు న్యాయంగా, పూర్వంమాదిరి, రావలసిన నీటిని సెంట్రల్ డెల్టావారు (తూ. గోదావరి) అపహరిస్తున్నట్లు భావిస్తున్నారు.

ఇది సరికాదు. సెంట్రల్ డెల్టాలోను, తూర్పు డెల్టాలోను, కూడా యీ సంవత్సరం లోకలైజేషన్‌స్కీము ప్రకారం దాళ్వా భూములు నిర్దేశింపబడ్డాయి. ప్రస్తుతం గోదావరినుండి వచ్చేనీరు ఉభయజిల్లాలలో నిర్దేశించబడిన భూములకు మాత్రమే దాళ్వాపంటకు పంచిపెట్టబడతాయి. కాబట్టి, ప్రపోర్షనేట్ డిశ్చార్జి పద్ధతిని రద్దుచేయాలని కోరే పశ్చిమ గోదావరి జిల్లా రైతులు యీక్రిందివిషయాలను గుర్తించాలి :

1. గోదావరినీటిని ఉభయజిల్లాల రైతాంగం దామాషాగా పంచుకోవాలా, అక్కర్లేదా?

2. ఈపద్ధతిని రద్దుచేయవలసిందని కోరడమంటే అర్థం, నిర్దేశించబడ్డ ఏరియాకంటే అదనంగా నీటిని అడగడం కాదా? ఇందువల్ల తూర్పుగోదావరి జిల్లాకు న్యాయంగా రావలసిన నీటిని నిరాకరించడం కాదా?

3. పశ్చిమ గోదావరిజిల్లాలో దాళ్వాపంట దెబ్బ తినటానికి కారణం, లోకలైజేషన్ స్కీముప్రకారం నిర్దేశించబడిన ఏరియాకంటే ఎక్కువ ఏరియాను సాగుచేయటం. అందువల్ల మొత్తం సాగుకు నీరు సప్లయికాక పోవటం, కాదా?

కాబట్టి, పశ్చిమగోదావరి జిల్లారైతులు ప్రపోర్షనేట్ డిశ్చార్జి పద్ధతిని రద్దుచేయవలసిందని కోరుటకు బదులు, ఉభయగోదావరి జిల్లాల రైతులు యీక్రింది కోర్కెలకై ఆందోళన చేయాలి.

1. పోలవరం, శబరి, అనుముల్లంక, ప్రాజెక్టులను వెంటనే నిర్మించాలి. ఇందువల్ల 6 లక్షల యెకరం మెరకభూమిని సాగుక్రిందికి తీసుకురావడమేగాక, అదనపు దాళ్వా సాగుకూడా సాధ్యమవుతుంది.

2. గోదావరిలోని ఇసుకతిప్పలను, కనీసం హెడ్‌వర్క్సు మొగనున్న తిప్పలను, తీసివేయించాలి.

3. కాలువలన్నింటిలోను నం(స్తు)ను తీయించివేయాలి.

రైతులుకూడా తమతమ గ్రామాలలో నిర్దేశించబడిన ఏరియాకుమించిదాళ్వాసాగులు చేయడం ఆపివేయాలి. ఈసంవత్సరం పశ్చిమ గోదావరిజిల్లాలో 40 వేల యకరాలకు అదనంగా నీటి దరఖాస్తులు పెట్టినట్లు తెలుస్తోంది. ఇది అధికాహారోత్పత్తిగా భావించకూడదు. ఎందువల్లనంటే, నీరు ఎవరికీచాలక అందరూ నష్టపడిపోవడం జరుగుతుంది. కాబట్టి, లోకలైజేషన్ పద్ధతిప్రకారం నిర్దేశించబడిన దాళ్వాభూములుమాత్రమే సాగు అయేటట్లు రైతులు జాగ్రత్తతీసుకోవాలి.

రైతులు ఇరిగేషన్ బిల్లును ఉపయోగించుకోవాలి

కృష్ణాజిల్లాలో జమీందారీ ప్రాంతం కసుబీదగా ఉంది. శిస్తులభారంహెచ్చు. రెమిషన్ లేదు. చెరువులకు మరమ్మతులులేవు. 1932 లో కోర్టుడిక్రీద్వారా చెరువు మరమ్మతులు చేయమని తిరువూరు జమీందారుకు తెలియజేయబడినప్పటికీ, చిత్తపూరుగ్రామంలో యీరోజువరకు చేయకుండా, రైతులవద్ద మాత్రం రు 3000 వసూలు చేసుకున్నారు. సోమవరం చెరువుకు 1928 లో ప్రభుత్వం రు 1560 లకు ఎస్టిమేటువేసి, జమీందారుకు పనిప్రారంభించుమనిఉత్తరువుచేసింది. దాన్ని 1938 వరకూ తొక్కిపెట్టి యుంచారు. రైతులు ఆందోళనచేయగా, రు 2000 కు తిరిగి ఆర్డరు. దానిగతీ అంతే పట్టింది. మళ్ళీ 1942 లో రు 3500 కు ఆర్డరు. 1943 నవంబరులో తాత్కాలిక మరమ్మతుకై రు 600 శాంక్షన్ చేయబడింది. ఇవన్నీ కలెక్టరుగారి ఆర్డర్లే! అధికాహారోత్పత్తికై స్పెషల్ రివెన్యూ ఇన్‌స్పెక్టర్లను కూడా నియమించిచెరువులుపరీక్షించారు. దాదాపు 50చెరువులకు నోటీసు లిచ్చారు. అదీ పనిజరుగలేదు.

ఇప్పుడు ప్రభుత్వం ఇరిగేషన్‌బిల్లును ప్యాసుచేసింది. దీనినైనారైతులువినియోగించుకొని, చెరువుల మరమ్మతులకై కృషిచేయాలి.

రైతువర్కర్లు ప్రతి చెరువుకు, యిప్పుడున్నస్థితి; హెచ్చుపంటకుగల అవకాశాలు; ఇప్పుడు సాగుచేయబడే భూమి విస్తీర్ణం; ఇంకా ఎంతభూమిని అధికంగా సాగుచేయవచ్చు: మొదలైన వివరాలతో జిల్లాకలెక్టరుకు, జమీందార్లకు అర్జీలు పెట్టించి, రాయబారాలు నడిపించాలి. జమీందార్లు చేయకపోతే, రైతులే ఐక్యతతో స్వయంగా బాగుచేయించుకొని, సొమ్మును శిస్తునుండి రాబట్టుకొనుటకు ప్రయత్నించాలి.

ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టరుకు తెలియజేస్తూ, నకళ్లు దగ్గర ఉంచుకోవాలి. జమీందార్ల దయకు ఇరిగేషన్ బిల్లును విడిచిపెట్టరాదు. తరుణం నాలుగునెలలుమాత్రమేఉంది. మేనెలనుండి వర్షాలు ప్రారంభమవుతాయి. కాబట్టి రైతులు మేల్కొని, అధికాహారోత్పత్తికి జమీందారుపెట్టే ఆటంకాలను పైవిధంగా ఐక్యతతో ఎదుర్కొనాలి.

అనుమర్లపూడి వెంకటరామారావు
(కృష్ణాజిల్లా రైతుసంఘాధ్యక్షుడు)

బుడమేరు ప్రాజెక్టు పని ప్రారంభం కావాలి

బుడమేరు ప్రాజెక్టుకై కృష్ణా జిల్లా రైతాంగం అనేక సంవత్సరాలుగా ఆందోళన చేస్తూంది. ఇదేవిధంగా పశ్చిమగోదావరిజిల్లా రైతులు తమ్మిలేరు ప్రాజెక్టుకొరకై ఆందోళన చేస్తూ వచ్చారు. చివరకు యీఆందోళన ఫలితంగా ప్రభుత్వం తమ్మిలేరు, బుడమేరు ప్రాజెక్టుల నిర్మాణానికి బెజవాడ స్పెషల్ డ్రైనేజి డివిజనును స్థాపించి, పరిశీలన ప్రారంభించింది.

పరిశీలన సాగుతూండగానే, అనంతపురం సర్కిలుకు స్టాపులోని అధికభాగాన్ని ట్రాన్సుఫర్ చేశారు. ఆంధ్రరాష్ట్ర రైతుసంఘము, కృష్ణా జిల్లా రైతుసంఘం చీఫ్‌ఇంజనీరు వద్దకూ, ఎడ్వైజరు రామమూర్తి గారివద్దకూ, రాయబారంవెళ్ళి, ప్రాజెక్టుపనికి వాయిదా వేయవద్దనీ, స్టాపును హెచ్చించి పనిని కొనసాగించవలసిందనీ, కోరారు. తత్ఫలితంగా రాయలసీమలో కరువుపనులు మూసివేయబడగానే తిరిగి స్టాపును యిక్కడికి ట్రాన్సుఫర్‌చేసి, పనిని కొనసాగించుతామని ఉభయులూ వాగ్దానంచేశారు.

అనంతపురం జిల్లాలో కరువుపనులు ఆపుజేయబడినప్పటికీ, బుడమేరు ప్రాజెక్టు పరిశీలనను తిరిగి ప్రారంభించుటకు పి. డబ్లియు. డి. లో కొందరు ముఖ్యులు వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. ఇట్టిఉద్యోగుల వ్యతిరేకతవల్లనే ఇంతవరకూ ప్రాజెక్టు కట్టబడక ప్రతియేటా 60 వేల యకరాల పంట నష్టమవుతోంది. కాబట్టి కృష్ణా, ప. గోదావరిజిల్లాల రైతులు డ్రైనేజి డివిజనును పునఃస్థాపించి పని ప్రారంభ మయేటట్లు ఆందోళన చేయాలి. త్వరలోనే కృష్ణా, ప. గోదావరి జిల్లా రైతుసంఘాల తరపున కొల్లేటి రైతుల సమావేశం జరుగబోతూంది. రైతులందరూ దానికి హాజరై, తమ కోర్కెను ఐక్యకంఠంతో ప్రభుత్వానికి వెల్లడించ వలసినదిగా కోరుతున్నాను.

నండూరి ప్రసాదరావు
కార్యదర్శి, ఆంధ్రరాష్ట్రరైతుసంఘం

పల్నాటిసీమలో కరువు

ఈ తాలూకాలో గత 3 సంవత్సరాల నుండి సకాలానికి వర్షంలేక, పంటలు సరిగా పండలేదు. 1943 లో, మొదట తొలకరించగానే రైతులు పునాసపైర్లు, జొన్న - సజ్జ మొదలైనవి వేశారు. అవి పెరిగి, గింజ పట్టబోయే సమయానికి వర్షాలు కురియనందువల్ల, జొన్న-సజ్జ పైరులు తాలూకా అంతటా చెడిపోయాయనే చెప్పాలి.

భాద్రపదమాసాంతంలో వర్షాలు విధీ విరామంలేకుండా 15 రోజులు కురియడంవల్ల అదివరకువేసిన కొర్ర పండి, కోతకువచ్చిన సమయంలో చేతికిరాకుండా నాశనమయింది. జొన్న, సజ్జ, మొదలైన ఆహారధాన్యాలు మార్కెట్లో ఎక్కడా కనుపించడంలేదు. బియ్యం కొనుక్కొనితిందామా, అంటే నిలవ వ్యాపారస్తులు రూపాయకు 6 సోలల 3 గిద్దలు చొప్పున అమ్ముతున్నారు.

గోరుచుట్టుమీద రోకటిపోటన్నట్లు, రైతులవద్ద ఉద్యోగస్థులు నిర్బంధంగా శిస్తులు వసూలుచేస్తున్నారు. వ్యవసాయానికి అత్యవసరమైన పశువుల్నిసహితం రైతులుఅమ్ముకోవలసివస్తూంది.

ఈ విషమపరిస్థితుల్ని ప్రభుత్వం వెంటనే గుర్తించి, రైతులకు రెమిషన్ యివ్వాలి. ఇకముందు తాలూకాలో కరువుపరిస్థితు లేర్పడకుండా చేయడానికి యీ క్రింది పనులను ప్రారంభించాలి.

1. మేళ్ళనాగు ప్రాజెక్టును నిర్మిస్తే 1000 యకరాల భూమి సాగు అవుతుంది.

2. నాగులవరం, పాతలకలస, వరవల మధ్య 2 ఫర్లాంగులు కృష్ణనీటి కయ్యనుమేరగట్టి, నీటిని పారించిన యెడల 6 వేల రూపాయల ఖర్చుతో 400 యకరాల భూమి పల్లపు సాగుకు ఉపయోగిస్తుంది.

3. దైదప్రాజెక్టును 30 సంవత్సరాల క్రితమే ప్రారంభించి వదలివేశారు. దాన్ని తిరిగి ప్రారంభించిన యెడల పల్నాడు, సత్తెనపల్లి, గుంటూరు తాలూకాలకు నీరు సప్లయి అవుతుంది.

4. మైనర్ ఇరిగేషన్ చెరువులను బాగు చేయించాలి.

5. కళ్ళగుంట ఫారెస్టు రిజర్వు, హనుమంతునిపాడు ప్రదేశం, 21 నెం. వెంకయ్య కుంట ప్రదేశం, 22 నెం. మొట్టిరేగడి, పత్తి కుంటరేగడి, 24 నెం. పిన్నెల్లి రామయ్య కుంటప్రదేశం, మడరేగడి - మొత్తం 1400 యకరాలు మెరకసాగుకు పనికివస్తుంది. పల్లపుసాగుకు పనికివచ్చేభూమి 200 యెకరాలు ఉంది. కృష్ణాపురం సరిహద్దులో కృష్ణా రివర్‌భూమి 600 యకరాలువుంది. మొత్తం యీ 2200 యకరాల భూమిని అధికాహారోత్పత్తి నిమిత్తం ప్రభుత్వం సాగుకు తేవచ్చు.

6. ఫారెస్టు బంజరంతా సాగుకు ఇవ్వాలి.

7. ఎగ్రికల్చరల్ డిమాన్‌స్ట్రేటర్లద్వారా ప్రభుత్వం రైతులకు అప్పులియ్యాలి.

ఎం. పద్మనాభశాస్త్రి
(తాలూకా రైతుసంఘ ఆర్గనైజరు)

(5 వ పేజీ తరువాయి) వారి కృషికి మెచ్చుకొని హనుమయ్యగారు 'ఆంధ్రప్రభ' సంవత్సర చందాకోసం 36 రూపాయిలు ఇచ్చారు.

రైతుమహాసభ నిధి

అమృతలూరు (గుంటూరుజిల్లా)లో పార్టీ సభ్యులు, సానుభూతిపరులు కలిసి 35 మంది 3 రోజులు కోతలకువెళ్ళి, వచ్చిన రు 60 లను అఖిలభారత రైతుమహాసభనిధికి ఇచ్చారు. రోజుకూలీ చేసుకొని కాలం గడుపుకొనే బీదరైతులు 20 మంది సంతోషంతో మహాసభ నిధికి రు 15-0-0 ఇచ్చారు.

నేటిపరిస్థితులలో కాంగ్రెసువాదు లేమిచేయాలి?

[శ్రీ దేగల సూర్యనారాయణగారు గాంధీభక్తులుగా 1941 వ్యక్తిసత్యాగ్రహంలో జైలుకు వెళ్లారు. 18 నెలల పూర్తి శిక్షను అనుభవించి 1942 ఆగస్టుచివరను విడుదలయ్యారు. మరల 1943జనవరిలో అరెస్టయి శిక్షింపబడ్డారు. సంవత్సరం శిక్ష అనుభవించి డిశెంబరు 22 తేదీన విడుదలయ్యారు. గాంధీభక్తుడు, కాంగ్రెసు సైనికుడు, జైలుకు వెళ్ళిన వీరు ప్రస్తుతపరిస్థితులలో కాంగ్రెసువాదులేమిచేయాలో స్పష్టంగా ఈ దిగువ స్టేటుమెంటులో తెలిపారు.]

"1942 ఆగస్టులో జరిగిన విధ్వంసకచర్యలు కాంగ్రెసు కార్యక్రమముకాదు. అవి గాంధీజీ అహింసా విధానముకుపూర్తిగా వ్యతిరేకము. అందుచే వాటిని నేను అప్పుడే వ్యతిరేకించితిని. గాంధీజీ ఉపవాస సందర్భములో ప్రకటించబడిన లేఖలలో పైవిషయములు స్పష్టమైనవి. ఆగస్టుదినాలలో యితరుల దుష్ప్రచారముకు మోసపోయిన కాంగ్రెసువాదులు కూడా, గాంధీజీ లేఖల అనంతరం తమ పొరపాటును తెలుసుకోగలుగుచున్నారు.

"డిశెంబరు 21 వ తేదీని అలిపూర్ క్యాంపు జైలునుండి విడుదలైతిని. ఇప్పుడు కాంగ్రెసు దేశభక్తులము ఏమిచేయాలా అనే విషయాన్ని గురించి సాకల్యంగాఆలోచించాను. ఇప్పుడు దేశపరిస్థితులన్నియు చాలా విషమస్థితిలో యున్నవి. ఒకవైపున బెంగాలులో కరువువల్ల లక్షలకొలది ప్రజలు అసువులను బాయుచున్నారు. రెండవవైపున మనదేశముపై జపానువాడి ప్రమాదము రోజురోజుకు ఎక్కువగుచున్నది. అప్పుడే చిట్టగాంగుపైనను, కలకత్తాపైనను జపానువారు బాంబులవర్షము కురిపించుచున్నారు.

"ఈ దేశము మన మాతృదేశము. ఏస్వాతంత్ర్యం కొరకై కాంగ్రెసు గత 50 ఏండ్లనుండి పోరాడిందో అందుకొరకే మాతృదేశాన్ని ఫాసిస్టు దురాక్రమణనుండి రక్షించుకోవాలి. ఆ ఆదర్శముకొరకై మన సోదర ప్రజలను ఆకలి మంటలనుండి కాపాడాలి. ఇవి సామాన్యమైన విషయములుకావు ప్రజలందరం - హిందువులము, ముస్లిములము, అన్నిమతమువారము, అన్ని పార్టీలవారం - కలసి ఐకమత్యముతో కృషిచేస్తేనే వీటిని సాధించగలం. ముస్లిం జాతులకు స్వయంనిర్ణయహక్కును యిచ్చుటకు అంగీకరించుదాం. తద్వారా దేశములోకల్లా పెద్దసంస్థలైన కాంగ్రెసు ముస్లింలీగు ఐక్యతను నిర్మించుదాం. కాంగ్రెసు వర్కింగు కమిటీ ఢిల్లీలోచేసిన తీర్మానంలో రాష్ట్రాలను బలవంతంగా ఫెడరేషనులోకలిసి ఉండాలని నిర్బంధించము అని అంగీకరించింది. ఇంకొక అడుగు ముందుకువేసి, ముస్లింజాతుల స్వయం నిర్ణయహక్కును గుర్తిస్తే, ముస్లిం ప్రజల సందేహాలు తొలగిపోతాయి. తద్వారా జాతీయైక్యతను నిర్మించుకొని మన నాయకులను విడుదల చేయించుకోగల్గుతాము. ప్రజలను కరువునుండి రక్షించగల్గుతాము. దేశాన్ని ఫాసిస్టులనుండి రక్షించగలం. ఇదే నేటి పరిస్థితులలో భారతస్వాతంత్ర్యకాంక్షితుల కర్తవ్యం.

"నేను పై కర్తవ్యమును నెరవేర్చుటకు శక్తికొలది పనిచేస్తాను. బైటనున్న కాంగ్రెసు సోదరులందరు ఈ విధంగానే చేస్తారని ఆశిస్తూయున్నాను."

పోటీసంఘాలు రైతులకు శ్రేయస్కరంకాదు

ఆర్యా, కృష్ణాజిల్లాలో జిల్లా రైతుసంఘం 1935 లో కొద్దిమంది సభ్యులతో ఏర్పడినప్పటినుండి దినదినాభివృద్ధిచెందుతూ, నేడు 40 వేల ప్రాథమిక సభ్యత్వం, 800 గ్రామాలలో గ్రామసంఘాలు, 10 తాలూకా సంఘాలు, కలిగి యీ జిల్లాలో ప్రతి రైతు సమస్యను పరిష్కరించుతూ, రైతులందరి తరపున బలమైన ప్రధాన సంస్థగా వుండి పనిచేయుచున్నది.

ఇట్టి స్థితిలో ది 19-12-43 న శ్రీ పామిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, కామినేని వెంకటప్పయ్యగార్లు మొదలగు కొందరువ్యక్తులు బెజవాడలో సమావేశమై, కృష్ణాజిల్లా రైతుసంఘ పునరుద్ధరణ అంటూ ఒక కమిటీని ఏర్పాటుచేసి, ఆ కమిటీలో కొంతకాలం జిల్లారైతుసంఘ కార్యనిర్వాహక సభ్యుడుగాను, ప్రస్తుతం నూజివీడు తాలూకా రైతుసంఘ ప్రెసిడెంటుగాను ఎన్నుకొనబడి పనిచేయుచున్న నన్నుకూడా ఒక సభ్యునిగా నియమించినట్లు ప్రకటించినారు. ఈ జిల్లా రైతుసంఘం ఏర్పడినప్పటినుండి ఎప్పుడూ రద్దుగాక పనిచేస్తూ, రైతుల తరపున అనేక విజయాలు సాధించుతూన్న సంగతి సోదర రైతులందరూ ఎరిగినదే. ప్రస్తుతం కరువు మూలకంగా రైతులందరూ దినదినం ఎదుర్కొనవలసిన అనేక క్లిష్టసమస్యలు ఏర్పడినపరిస్థితులలో, వ్యక్తిగత ప్రాబల్యంకొరకు పోటీసంఘాలుపెట్టి, రైతులయొక్క సంఘటితశక్తిని విధ్వంసముచేయ పూనుకొనుట రైతులకు ఎంతమాత్రం శ్రేయస్కరంకాదు. కాబట్టి ప్రస్తుతం ఏర్పడిన కమిటీతో నా కెట్టి సంబంధమూలేదు. ఇతర సభ్యులనుకూడా పైనచెప్పిన పరిస్థితులు గమనించి, గత 8 సంవత్సములనుండి రైతులందరి తరపునా అండగావుండి పనిచేయుచున్న రైతుసంఘమునే బలపర్చవలసినదిగా కోరుచున్నాను.

పర్వతనేని వెంకటసుబ్బయ్య,
నూజివీడు తాలూకా రైతుసంఘ అధ్యక్షుడు.
ది 24—12—43.

జాడ్యాల విజృంభణ

చినకళ్ళేపల్లి (దివి తాలూకా) మాదిగ గూడెంలో గతమాసం 17 వ తేదీని కలరా ప్రారంభమైంది. మూడురోజుల్లో ఐదుగురికి వ్యాధి తగిలింది. ముగ్గురు చనిపోయారు. గూడెమంతా బెంబేరెత్తిపోయింది. చనిపోయినవారిని తొలగించడానికయినా ధైర్యం లేకపోయింది. అప్పుడు ప్రజారక్షణదళ వాలంటీర్లు వచ్చి శవాలను అలానేవుంచడం వల్ల కలిగే ప్రమాదాన్ని వివరించి, ఎవరూ తీయకపోతే తామే తీయడానికిపూనుకున్నారు. అప్పుడు గూడెంలోనివారే వాటిని తీసివేశారు. మొదట్లో వందరూపాయిలిచ్చి ఒకభూతవైద్యుణ్ణి తెచ్చి కలరా దేవతను శాంతింపజేయాలనుకున్నారు. కాని వాలంటీర్ల ప్రచారంఫలితంగా ఆ ప్రయత్నం మానుకున్నారు.

కలరా ప్రారంభమయినదగ్గర్నుంచి స్థానిక కమ్యూనిస్టులు, ప్రజారక్షణదళం కలిసి దానిని అరికట్టడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. కలరా నివారణోపాయాలను ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు. స్టిరప్‌పంపుతో వీధులన్నిటిలోను ఫినైల్ చల్లుతున్నారు. చెత్త, మురికి, తుడిచి శుభ్రం చేస్తున్నారు.

డాక్టరు హనుమంతరావుగారిని కామ్రేడ్సు అక్కడికి తీసుకువచ్చి, కలరా నివారణోపాయాలను చెప్పించారు. వారిశక్తికొలది మందు లిప్పించారు.

ప్రజలకు మలేరియా, పశువులకు గాళ్ళు

చింతలపూడి తాలూకా (పశ్చిమ గోదావరి జిల్లా)లో కొన్ని గ్రామాల్లో మలేరియాజ్వరం తీవ్రంగా చెలరేగింది. బీదలుండే ప్రాంతాల్లో మరీను. ఇది ఇలావుండగా అనేకగ్రామాల్లో పశువులకు గాళ్ళుతగిలి, చాలనష్టం కలుగుతూంది. ఈపరిస్థితుల నెదుర్కొడానికి తగిన వైద్యసౌకర్యాలేవీలేవు. ప్రభుత్వం వెంటనే పూనుకొని తగిన మందులస్టాకులతో యీ జాడ్యాల నివారణకు కృషిచేయాలి.

ప్రజాసేవకునికి కంటిలోపాప ప్రజాసంస్థ

"నువ్వు కమ్యూనిస్టువుగదా — కూలి కూడా చేస్తావా?"— అని గోరిజవోలుగుంట పాలెం(గుంటూరుతా॥)లో కామ్రేడ్ వెంకటప్పయ్యను ఒక పౌరుడు అడిగాడు, ఎగతాళిగా. "నాపార్టీని పోషించుకోడానికి కూలీఐనాసరే చేస్తాన"న్నాడు కామ్రేడ్, తడుపుకోకుండా.

"అయితే ఈనీళ్లకావిడి నా ఇంటికిమొయ్యి 0-8-0 ఇస్తాన"న్నాడా పౌరుడు. జంకూ, గొంకూ లేకుండా కామ్రేడ్ నీళ్లకావిడి మోశాడు. అలా జరుగుతుందనుకోలేదా పౌరుడు. ఆశ్చర్యపోయాడు. ఎగతాళి వైఖరి మటుమాయమయిపోయింది. ఇంటికి వెళ్ళగానే ఎంతో గౌరవంతో పార్టీనిధికి ఒక రూపాయి ఇచ్చాడు. ఆపౌరుడు తనజీవితంలో మరచిపోలేని పాఠాన్ని నేర్చుకున్నాడు. చిత్తశుద్ధిగల ప్రజాసేవకుడు. స్వార్థత్యాగిఅయిన ప్రజాసేవకుడంటే ఎటువంటివాడో తెలుసుకోగలిగాడు.

ప్రజల క్షేమంకోసం సర్వశక్తులా కృషి చేయడమే చిత్తశుద్ధిగల ప్రజాసేవకుల జీవిత లక్ష్యం. ఈ సేవ ఫలవంతం కావాలంటే, ఎప్పటికప్పుడు తమను సరియయినమార్గంలో నడుపుతూన్న తమసంస్థల్ని, ప్రజాసంస్థల్ని, బలపరచుకోవాలి — పోషించుకోవాలి. ప్రజాసేవకునికి కంటిలోపాప ప్రజాసంస్థ.

ఆంధ్రదేశంలో, అనేకప్రాంతాల్లో కమ్యూనిస్టులు, పార్టీఅభిమానులు, రైతులు, కూలీలు, కార్మికులు, ఈ విషయాన్నే వేనోళ్ళ చాటుతున్నారు. చెమటోడ్చి సంపాదించి తమ సంస్థలకు నిధులను ప్రోగుచేస్తున్నారు.

గోరిజవోలు గుంటపాలెంలోనే గతమాసం 18 వ తేదీని నలుగురుపార్టీసభ్యులు, 6 గురు సానుభూతిపరులు, ఊరేగింపుగా అరుమైళ్ళు నడిచివెళ్ళి 1½ యకరాలు వనకట్టి కుప్పవేశారు. పార్టీఫండుకి రు 5-0-0 సంపాదించారు.

గుంటూరు తాలూకాలోనే నిమ్మగడ్డవారి పాలెంలో14-12-43 న 4 గురు పార్టీసభ్యులు, 14 మంది సానుభూతిపరులు మూడుగ్రామాల మీదుగా నడచివెళ్ళి, 5 యకరాల వనకట్టి, కుప్పవేసి పార్టీనిధికి రు 20-0-0 సంపాదించారు. యనగంటి వెంకటస్వామిగారు 60 ఏళ్ళ వృద్ధమూర్తి, ఎర్రజండాను ఎంతోఅప్యాయంగా పట్టి ముందు నడిచాడు - కట్టివేతలో యువకులకు హుషారిచ్చాడు చేను ఆసామి అదనంగా రు 2-0-0 పార్టీనిధి ఇచ్చాడు.

200 మంది కోతకోశారు

సమరగీతాలతో పార్టీబ్యాండు ముందు సాగుతూంది-ఆవెనుక కదంతొక్కుతూ, పదం పాడుతూ బాలసంఘసభ్యులు-వారివెనుకరైతులు, కూలీలు - స్త్రీలు, పురుషులు జయజయ ధ్వానాలతో నడుస్తున్నారు. గుడివాడతాలూకా వెంట్రప్రగడలోని దృశ్యం ఇది. ఆ ఊరేగింపులో అంతా మొత్తం 200 మంది. బాలసంఘంవారు 24 గురు, స్త్రీలు 34 గురు. వీరంతా కలిసివెళ్ళి 25 యకరాలలో కట్టివేతచేశారు. వచ్చిన 60 రూపాయిలలో కొంత పార్టీకి, కొంత వ్యవసాయకూలీసంఘానికి ఇచ్చారు.

నగుళ్ళ అనే ఆమె 70 ఏళ్ళ వృద్ధురాలు. "ఎక్కువపనిచేస్తే మనపార్టీకి ఎక్కువడబ్బు వస్తుంది" అని తోడివారిని ఉత్సాహపరుస్తూ మోపులు మోసింది.

"బెంగాలు ప్రజలకు సాయంచేయాలంటే పనబాగావేయండి"-అంది 60 ఏళ్ళ లక్ష్మమ్మ. ఈ విధంగా బాలురు, వృద్ధులు,—స్త్రీలు, పురుషులు తమ పార్టీని, తమ సంఘాలను పోషించుకోడానికి పాటుబడ్డారు.

ముదినేపల్లి ఫిర్కా—బొమ్మలూరులో గతమాసం 20 వ తేదీని గ్రామయువజన, రైతు, కూలీ సంఘసభ్యులు 28 మంది కలిసి లింగం నాగభూషణంగారిచేను 11 యకరాలు కట్టివేతవేసి పార్టీనిధి సంపాదించారు. 70 ఏళ్ళ కోగంటి పుల్లయ్య, 60 ఏళ్ళ గోగినేని రత్తయ్యగార్లు ఇందులో పాల్గొన్నారు.

దివి తాలూకాలోని నాగాయతిప్పలో పార్టీ సభ్యులు, సానుభూతిపరులు కలిసి 33 మంది వరికోతకోసి పార్టీనిధికి 30—14—0 సంపాదించారు. చినవోగిరాలలో ఈ విధంగానే ఒక రోజు 7 యకరాలు, మరోరోజు 30 యకరాలు కట్టివేతలు వేసి నిధి పోగుచేశారు.

తేలప్రోలులో పార్టీసభ్యులు, సానుభూతిపరులు కలిసి 22 మంది నాలుగు యకరాల్లో వనకట్టి కుప్పవేసి రు 13-0-0 పార్టీనిధికి సంపాదించారు. మేముమాత్రం తీసిపోతామా అని బాలసంఘసభ్యులు 6 గురు ఆపొలాల్లోనే పరిగ యేరి రు 3-0-0 పార్టీనిధికిచ్చారు.

కార్మికసంఘానికి నిధి

ఉయ్యూరు పంచదారఫ్యాక్టరీ కార్మికులు 26 మంది కలిసి కార్మికపతాకంతో ఊరేగుతూ కృష్ణదత్తుగారి పొలానికి వెళ్ళి 4½ యకరాల్లో వరికోతకోసి ఫ్యాక్టరీ కార్మికసంఘానికి రు 36-0-0 నిధి సంపాదించారు.

ఈమిల్లుకార్మికులు, స్థానికకమ్యూనిస్టులు కలిసి 36 మంది మరోరోజున 1½ యకరాల్లో వరికోత కోసి పార్టీనిధికి రు 12-0-0 సంపాదించారు.

యువజనసంఘనిధికి

తాడికొండ (గుంటూరుజిల్లా) యువజన సంఘసభ్యులు గతమాసం 13 వ తేదీని యువజనసంఘనిధికోసం శ్రీ పిడికిటి హనుమయ్యగారి మూడుయకరాల పుగాకుతోటకు నీళ్ళు పోశారు. వారికివ్వవలసినది 10 రూపాయలే అయినా (తరువాయి 4 వ పేజీలో)

దేశరక్షణపట్ల రైతుల ఉత్సాహాన్ని కుంటుపరుస్తున్నారు

యుద్ధబాండ్ల విషయంలో ఉద్యోగుల నిరంకుశత్వం

కావలిసిన రోజులలో వర్షంలేదు. అవసరంలేని రోజులలో వర్షం. దీనిఫలితంగా తిరువూరు తాలూకాలో పంటలు నష్టపడ్డాయి. అక్టోబరు 16, 17 తారీఖులలో వర్షంపడి, వేరుశనగ తడిసి మొలకెత్తింది. నాల్గోవంతు పంట నష్టమైంది. జొన్నలు చూద్దామా, సకాలంలో వర్షాలులేక సగంపంటే పండింది. అందులో ఏదేనుచూచినా కాటుక కంపులే.

గోరుచుట్టుపై రోకలిపోటన్నట్లు, అసలే నష్టపడిన రైతులమీద స్థానిక అధికారుల నిర్బంధపరంపరలు. తిరువూరు తాలూకా డిప్యూటీ తహశీల్దారు యుద్ధ బాండులను నిర్బంధంగా కొనాలంటూ తాఖీదులిచ్చారు.

యుద్ధబాండ్లు కొనాల్సిందే. కొని నోట్ల ముమ్మరాన్ని (ఇన్ఫ్లేషన్) తగ్గించి జీవితావసరవస్తువులను చౌకచేసుకోవల్సిందే. కొని దేశరక్షణకుతోడ్పడవలసిందే. దీన్ని ఎవరూ కాదనడంలేదు.

కాని పిడుక్కీ- బియ్యానికీ ఒకేమంత్రం అన్నట్లు, తాహతు, బేతాహతు ఆలోచించకుండా వరసపెట్టి అందర్నీ కొనమనడంలోనే వస్తుంది చిక్కు.

అందులోనూ తిరువూరు తహశీల్దారు తాఖీదులు చూడండి. షైరువారిగా బాండ్లు కొనాలట. పుట్టి 1 కి వేరుశనగకు రు 3-0-0, ధాన్యానికి రు 5-0-0, జొన్నలకు రు 6-0-0, మిరపకాయకు రు 10-0-0, పొగాకుకు రు 10-0-0 ఇచ్చుకోవాలట. అలా వసూలు చేయమని గ్రామాధికారులకు ఉత్తరువు పంపారు. ఇంతేగాదు. వేరుశనగ కొనే మిల్లు యజమానులకుకూడా ఒక ఆర్డరు పంపారు. యుద్ధబాండ్ల రశీదుచూపించితేనే వేరుశనగ కొనాలని, రశీదులు లేనివాళ్ళదగ్గర పుట్టికి రు 3-0-0 వసూలుచేయాలని, అందులో వ్రాశారు. దీనిఫలితంగా రైతులు తమపంటను అమ్మడానికి సాహసించి ముందుకు రాలేదు. తర్వాత తీరా రైతులు అమ్మబోయేసరికి పుట్టికి 10 రూపాయలధర పడిపోయింది. పోనీ రైతులకిచ్చే యుద్ధబాండ్ల రశీదులుకూడా విడివిడిగా ఇవ్వరు, గ్రామ మొత్తానికి ఇస్తారు. అలాంటప్పుడు ప్రతిరైతూ మిల్లువద్ద రశీదెలా చూపగల్గుతాడు ?

స్థానికాధికారుల ఈ నిరంకుశచర్యలు, దేశభక్తితో ముందుకువచ్చే రైతుల ఉత్సాహాన్నికూడ కుంటుపరుస్తాయి. కంభంపాడు, గొల్లమండల, అట్లప్రగడ గ్రామాలరైతులు తాము విడివిడిగా యుద్ధబాండులను కొనలేమని, గ్రామంమీద సమిష్టిగా కొన నిశ్చయించారు. ఈ గ్రామాలలో మొత్తం రు 1800-0-0 వసూలయింది. దీనిని తహశీల్దారువద్దకు రైతులు తీసికెళ్ళారు.

కాని అతను తీసికొన నిరాకరించాడు. పైగా బొరుగండ్ల వెంకటసుబ్బారావు గారనే రైతును పిలిచి, "నేను 1500 రూపాయల బాండ్లను కొనను - 200 రూపాయలకంటె బాండ్లను కొనను-నేను యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నాను-రైతుసంఘాలతోసంబంధంవున్నది." అనేధోరణిగల స్టేటుమెంటును వ్రాసిఇమ్మని నిర్బంధించాడు. ఆయన వ్రాసియివ్వ నిరాకరించాడు.

ఇంతేగాదు. యుద్ధబాండ్లను కొనవలసిన ఆవశ్యకతను నచ్చచెప్పుతూ, ఊటుకూరు, కొణిజర్ల, ఎర్రమాడు, అర్లపాడు, ఖమ్మంపాడు, గొల్లమండల, వగ్గెరా గ్రామాలలో కమిటీలను ఏర్పరిచి శక్తివంచన లేకుండా బాండ్లు సొమ్మును వసూలుచేస్తున్న రామిశెట్టి వేణుగోపాలరావుగార్ని అరెస్టుచేయించాడు.

ఈవిధంగా తిరువూరు తహశీల్దారు వైఖరి శ్రుతిమించి రాగాన పడుతోంది. ఇట్టిచర్యలు దేశరక్షణకూ, యుద్ధవిజయానికీ తోడ్పడవు. అందుచే, యుద్ధంలో సహకారం చేస్తూ యుద్ధవిజయం కాంక్షించేవారు సైతం, "దేవుడా ! ఇలాంటి 'మిత్రుల' నుండి కాపాడు" అని ప్రార్థించవలసి వస్తుంది.

నూజివీడు తాలూకా

ఒక్క తిరువూరులోనేకాదు—నూజివీడులో కూడ దాదాపు పరిస్థితులు ఇలాగే వున్నాయి.

రైతుసంఘాలు, కమ్యూనిస్టులు, కృషిచేసి రైతులను యుద్ధబాండ్లకు సుముఖులుగా చేస్తున్నారు. తమశక్తినిబట్టి యుద్ధబాండ్లను కొనేటట్లు రైతులను ముందుకు తీసుకువస్తున్నారు. కాని స్థానికోద్యోగుల నిరంకుశ ప్రవర్తన ఈ కృషికి అడ్డంకి కల్గిస్తోంది.

కొన్ని గ్రామాలలో గ్రామోద్యోగులు, రైతులను వేరుశనగ అమ్మవద్దనీ, యుద్ధబాండ్లు కొనకపోతే జైలుకు పంపుతారనీ, ఇంట్లోసామాన్లు బయటవేస్తారనీ, భయపెడుతున్నారు. ప్రతిరైతూ, శిస్తుకు రెట్టింపుగాని, ఎకరాకు రు 10-0-0 గాని తప్పకఈయాలని నిర్బంధించుతున్నారు. ఇలాచేస్తే తమమీద ఎక్కువపడతదనే ఉద్దేశ్యంతో కొందరు పెద్దరైతులు ఆ ఉద్యోగులను సపోర్టుచేస్తున్నారు. దీనితో బీదరైతులు భయపడసాగారు.

ఇట్టి పరిస్థితులలో సొప్రమెట్ట, తాడేపల్లి, అమ్మోరుగూడెం, నూగొండపల్లి, వద్లమాను, కలటూరు, వట్టిగుడిపాడు, గ్రామాలలో కమ్యూనిస్టులు ప్రచారంచేశారు. యుద్ధబాండ్లు ఎందుకు కొనాలో, తాహతుగలవా రెందుకు కొనాలో విశదీకరించారు. తమ తమ తాహతునుబట్టి ఎంతెంత ఇవ్వగలరో లిస్టులు తయారుచేసి, తాలూకా కమ్యూనిస్టు ఆఫీసుకు తీసుకురావలసిందని కోరారు. ఆ ప్రకారమే అమ్మోరుగూడెం, నూగొండపల్లి, వద్లమాను గ్రామరైతులు 15-12-43 న వసూలుచేసి తీసుకువచ్చారు. వీరు గాక, మెట్టగూడెం, అనంతసాగారం రైతులు, గ్రామోద్యోగుల, నిర్బంధంనుండి తప్పుకోడానికి తాలూకా రైతు సంఘ సహాయంకోసం ఆ ఆఫీసుకు వచ్చారు. ఈ రెండు గ్రామాలవారు ఏమీ ఇచ్చుకోలేని స్థితిలో ఉన్నారు.

ఈ క్రింది విధంగా రైతులు వసూలుచేసి తీసుకువచ్చారు. వద్లమాను : రు 200-0-0, అమ్మోరుగూడెం : రు 330-0-0, నూగొండపల్లి : రు 150-0-0.

ఈ రైతులనందరినీ వెంటబెట్టుకొని, తాలూకారైతుసంఘ కార్యదర్శి 15 వ తేదీన తహశీల్దారుగారి వద్దకు వెళ్ళి, పరిస్థితులను వివరించి చెప్పారు. యుద్ధబాండ్లకు చందాలిచ్చిన రైతుల లిస్టును చూపించారు. తహశీల్దారు గ్రామాలకు రశీదులిచ్చారు. మెట్టగూడెం, అనంతసాగారం గ్రామాలనుండి ఏమీ తీసుకోనన్నారు.

తహశీల్దారుగారి ఈ సమంజస వైఖరికి రైతులందరూ సంతోషించారు. కాని ఇట్టి వైఖరి ఎన్నాళ్ళో నిలువలేదు. శోభనాపుర గ్రామ వ్యవహారం తీసుకొంటే అది బోధపడుతుంది.

నూజివీడు డెప్యూటీ తహశీల్దారు శోభనాపురం రైతులను పిలిపించారు. ఎకరానికి రు 10-0-0 చొప్పున గాని, శిస్తుకు రెట్టింపు గాని, ఇచ్చి మొత్తం 8 వేల రూపాయలు యుద్ధబాండ్లను కొనాలని చెప్పారు. అవిధంగా ఇచ్చుకోలేమని, తమ శక్తికొలది తప్పకుండా పోగుచేసి ఇస్తామని చెప్పి రైతులు వెళ్ళిపోయారు.

3-12-43 న తాలూకారైతుసంఘ కార్యదర్శి ఈ గ్రామంలో బహిరంగసభ గావించి, యుద్ధబాండ్లను కొనవలసిన ఆవశ్యకతను గురించి చెప్పారు. రైతులు ఆయన సహాయంతో బాండులు కొనగలవారి తాహతును బట్టి, లిస్టు తయారుచేసి, రు 1930-0-0 లు వసూలుచేశారు. 10-12-43 న ఈ డబ్బును గ్రామరైతులు, తాలూకా రైతుసంఘ కార్యదర్శి, తహశీల్దారుగారివద్దకు తీసుకవెళ్ళారు. "ఈ గ్రామంలో 20 వేలు వసూలుకావాలి. మీరెందుకు జోక్యం కలుగుచేసుకుంటారు." అని రైతుసంఘ కార్యదర్శిని ప్రశ్నించాడు తహశీల్దార్. రైతులూ, రైతుసంఘ కార్యదర్శి, అలా ఇచ్చుకోలేమనిచెప్పారు. డిప్యూటీ కలెక్టరుతో సంప్రతించి మళ్ళా కబురుచేస్తానని తహశీల్దారు అన్నాడు. రైతులు వెళ్ళిపోయారు.

18,19 తేదీలలో శోభనాపురం వచ్చారు తహశీల్దారు. రైతుల్ని పిలిపించారు. తానొక స్టేట్మెంటు వ్రాసి మున్సబుకిచ్చి రైతులందరిచేత సంతకాలు పెట్టించమన్నాడు. రైతులు భయపడి సంతకాలు, నిశానీలు పెట్టారు.

ఆ స్టేటుమెంటు సారాంశం ఇది: "మా ఊరులో ఫలానాఫలానావారు యుద్ధబాండులను వసూలుచేసి రశీదు లివ్వలేదు." ఈవిషయం తహశీల్దారే చెప్పాడు. మరొక్కస్టేటుమెంటు పైకూడ సంతకాలు తీసుకొన్నారు. కాని దానిలో విషయమేమిటో తెలియదు.

23-12-43 న తహశీల్దారువద్దకు రైతుసంఘకార్యదర్శులు, కమ్యూనిస్టుపార్టీ ఆర్గనైజరు, మరికొందరు రైతులు, తాము పోగుచేసిన పైకం ఇవ్వడానికి వెళ్ళారు. కాని తహశీల్దారు, సాధారణదుస్తులతో నున్న ఒక కానిస్టేబుల్తో "శోభనాపురం రైతులను లాకప్చేయి" అంటూ బెదరించారు. తహశీల్దారులో మాట్లాడిన పిదప లాకప్చేద్దువు గానిలే అని చెప్పారు రైతు ప్రతినిధులు. తహశీల్దారును డబ్బుతీసుకోమనగా అతడు నిరాకరించాడు.

రైతు ప్రతినిధులు డిప్యూటీకలెక్టరువద్దకు వెళ్ళారు. అక్కడ ఈ తహశీల్దారే మళ్ళా తయారు. డిప్యూటీ కలెక్టరు సైతం రైతులు చెప్పే మాటలను వినకుండా, "మాకోటా 7 లక్షల పూర్తికావాలి. మీ రనవసరంగా ఎందుకు జోక్యం కలుగజేసికొంటారుపొండి," అంటూ డబ్బుతీసికో నిరాకరించాడు.

ఈ విషయమై జిల్లాకలెక్టరుకు ఒక పిటిషన్ పెట్టారు రైతులు.

జిల్లాకలెక్టరూ, రాష్ట్రప్రభుత్వమూ వెంటనే కలుగజేసికొని స్థానికోద్యోగుల నిరంకుశ చర్యలను అరికట్టాలి. లేకపోతే రోజురోజుకూ వీరి చర్యలు శృతిమించిపోతున్నాయి.

ఈ చర్యలు యుద్ధబాండ్లను ఇచ్ఛాపూర్వకంగా కొనే రైతుల ఉత్సాహాన్ని కుంటుపరచి, దేశరక్షణ యెడల తమకుగల బాధ్యతను నిర్లక్ష్యంచేసేటట్లు చేస్తున్నాయి. ఈఅధికారులచర్యలు ప్రభుత్వానికీ, ప్రజలకు, సహాయపడవు సరిగదా - శత్రువులకే పరోక్షంగా సాయం చేస్తాయి.

నెమలికల్లు

గుంటూరుజిల్లా సత్తెనపల్లితాలూకా నెమలికల్లు గ్రామానికి తహశీల్దారు వెళ్లాడు. రెండు పార్టీవాళ్ళను పిలిపించాడు. యకరానికి రు. 2-0-0 చొప్పున తప్పనిసరిగా ఇవ్వాలని చెప్పాడు. రైతులు వారంరోజులలో ఇస్తామని వసూళ్ల ప్రారంభించారు. కాని గ్రామ కర్ణం 2 రోజులలో ఇవ్వాలంటూ టముకు వేయించాడు. అలా ఇవ్వకపోతే యకరానికి రు 5-0-0 వసూలుచేస్తానని బెదరించాడు. ఒకపార్టీవారు రు 600-0-0 వసూలుచేసి ఇచ్చారు. ఆయగిరిపేరిట రు 100-0-0 లకు బాండ్లను ఇవ్వమని తహశీల్దారును కోరారు. కాని తహశీల్దారు "అలా ఇవ్వను. రెండవపార్టీకికూడా మొత్తానికేరశీదిస్తున్నాను. నేను చెప్పినట్లు వినకపోతే, తర్వాత యకరానికి రు 10-0-0 వసూలుచేస్తాను," అంటూ బెదరించాడు.

ఈ విషయంతెలిసి తాలూకారైతుసంఘ కార్యదర్శి అమరారెడ్డి, రాష్ట్రరైతుసంఘ కార్యనిర్వాహకసభ్యుడు వావిలాలగోపాలకృష్ణయ్యగార్లు తహశీల్దారును కలిసికొని మాట్లాడారు. కాని లాభంలేకపోయింది. పైగా కరణాన్ని సమర్థించాడు.

ఈ తాలూకా చాల బీదతాలూకా. రెండు సంవత్సరాలనుంచి కొన్నిఫిర్కాలలో పంటలు లేవు. కొందరు శిస్తులనే అప్పుచేసి కట్టవలసివస్తోంది. దానికితోడు సబ్రిజిష్ట్రారులుసైతం (ఉదా : క్రోసూరు గ్రామం) యకరానికి రూపాయిచొప్పున వసూలుచేస్తున్నారు.

ఈ విధంగా అన్ని డిపార్టుమెంటులూ రైతులను నిర్బంధించరాదు. రైతులనుండి శక్తికిమించిన వసూళ్లు చేయరాదు. ఒక్క రివెన్యూ డిపార్టుమెంటునే వసూలు చేయమనాలి. గ్రామాల మొత్తంమీద వసూలుచేసి యిచ్చిన వసూళ్ళను తీసుకోవాలి.

విశాఖపట్టణం జిల్లాలో

అక్టోబరునెలాఖరులో చీపురుపల్లి తాలూకాలో తుపానువల్ల విపరీతనష్టం కలిగింది.

5-11-43 న మద్రాసు రివిన్యూబోర్డు మెంబరువద్దకు 300 మందితోను, 12-11-43 న జిల్లాకలెక్టరువద్దకు 600 మందితోను, తాలూకా రైతుసంఘం డిప్యుటేషన్ వెళ్ళి, తుపాను ఫలితంగా ఏర్పడ్డ పరిస్థితులను తెలియజేసింది. అంతట కలెక్టరు 100 బస్తాల బియ్యం కంట్రోలురేటుకు అమ్మాలని, 40 వేల వెదుళ్ళు, 2 లక్షల తాటికమ్మలు ప్రజల కివ్వాలని శాంక్షన్ చేశారు.

బియ్యం పంపకం తహశీల్దారుద్వారా జరుగుతోంది. ఆయన బస్తాకు రు 10-0-0 యుద్ధబాండ్లక్రింద హెచ్చుచేసి అమ్మడం మొదలెట్టాడు. దీనిని అవకాశంగా తీసుకొని వర్తకులుకూడ తమవద్దనున్న నిలవబియ్యాన్ని రు 10/- హెచ్చువేసిఅమ్మసాగారు. "పిచ్చపుకూటికిశనేశ్వరుడురా" అన్న సామెత జ్ఞాపకం వస్తోంది తహశీలుదారుగారి వైఖరిచూస్తే.

రావులపాడు

అయితే, అన్నిచోట్ల స్థానికోద్యోగులు ఇలా ప్రవర్తించడంలేదు. 21-12-43 న గుడివాడ మేజిస్ట్రేటు రావులపాడు గ్రామం వచ్చారు. యుద్ధబాండ్లను కొనవలసిందని చెప్పారు. ఒక పెద్దరైతు, గ్రామం మొత్తం మీద అందరివద్ద వసూలుచేసి ఇస్తామని చెప్పారు.

స్థానిక కమ్యూనిస్టులు, బాండ్లు కొనలేని బీదరైతులు చాలామంది ఉన్నారని, శక్తికలవారు ముందుకువచ్చి కొనాలని ఉద్బోధించారు. ఇద్దరు కమ్యూనిస్టులు స్వయంగా వందేసిరూపాయల బాండ్లను కొన్నారు. ఈ చొరవజూసి మరి ఐదుగురు పెద్దరైతులు వందేసిచొప్పున 5 బాండ్లను కొన్నారు. ఈ ఏర్పాటుకు మేజిస్ట్రేటు అంగీకరించారు.

రావులపాడులో వలెనే తక్కినచోట్లగూడ స్థానికాధికారులు సమంజసవైఖరిని కనబరచాలని కోరుతున్నాం.

ప్రజాశక్తి చందావివరాలు

★

సంవత్సర చందా	5—0—0
అర్థ సంవత్సర చందా	2—8—0
పావు సంవత్సర చందా	1—4—0

★ యుద్ధ సమీక్ష

ఛిన్నాభిన్నమైనాజీసేనలు తిరోగమించుతున్నాయి

●

జితోమిర్, కొరోస్టిన్లకు విముక్తి

— తుమ్మల వెంకట రామయ్య

రెడ్ఆర్మీ శీతాకాల దండయాత్రలో అమోఘ విజయాలను సాధించుతోంది. డిశంబరు 16 న నెవెల్వద్దనూ, డిశంబరు 23 వ తేదీన కీవ్రంగంలోను రెడ్ఆర్మీ విజృంభించి అద్భుతవిజయాలను పొందింది. రెడ్ఆర్మీ ధాటినీ వేగాన్నీచూచి ప్రపంచం అంతా విస్మయం చెందుతోంది.

నాజీసేనలు తిరుగు దాడులలో పట్టుకున్న జితోమిర్, కొరోస్టిన్లను తిరిగి రెడార్మీ వశపరచుకొంది. జర్మన్లు 6 వారాలలో తిరుగుదాడులలో ఆక్రమించిన ప్రదేశానికంతా ఆరురోజులలో రెడ్ఆర్మీ విముక్తిగావించింది.

నెవెల్ రంగంలో రెడ్ఆర్మీ అనేక కష్టాలను ఎదుర్కొనవలసి వచ్చింది. దట్టమైన అడవులు, పెద్దపెద్ద చెరువులు, ఇంకా గడ్డకట్టని మంచు ఊబిలూ - వీటి అన్నిటినీ దాటిపోవాలి. ఈ ప్రదేశంలో ఒక్క అడుగు తప్పువేసినా, సొంతం మంచులో కూరుకు పోవలసిందే. ఇంతేగాదు. విటెబిస్క్చుట్టూ 10 మైళ్ళవరకు దిట్టమైన రక్షణశ్రేణినిజర్మన్లు నిర్మించారు. కాని రెడ్ఆర్మీ జర్మను శ్రేణిని ఛేదించు టేగాదు, గతవారం విటెబిస్క్నుండి పోలోటస్క్ పోయే రైల్వే మార్గంలో గండికొట్టి, విటెబిస్క్ను చుట్టుముట్టింది. ఇపుడు విటెబిస్క్కు దక్షిణంగా ఓర్షాకు పోయే రైలుమార్గంలో కూడ గండికొట్టింది. ఇది ఒక్కటే జర్మన్లు పారిపోడానికి మిగిలిన రైలుమార్గం. అందుచే ఇప్పుడు విటెబెస్క్లోని జర్మను సైన్యాలకు అత్యంత ప్రమాదం సంభవించింది. డజన్లకొలది గ్రామాలకు పట్టణాలకు నాజీ చెర తప్పించుతున్న "బాల్టిక్ ప్రథమ సైన్యాలు" త్వరలోనే బాల్టిక్ దేశాలలోకి అడుగుపెడతాయని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఇక కీవ్రంగంలో చూద్దాం. కొరోస్టిన్ - జితోమిర్ - ఈ రెండు కీలకస్థానాలూ రెడ్ఆర్మీ చేజిక్కాయి. తిరుగుముఖం పట్టుతున్న నాజీలు అపారమైన ఆయుధసామగ్రిని వదిలి పారిపోతున్నారు. వదిలిపోతున్న ప్రదేశాలను తగులబెట్టి ప్రజలను నానాహింసలుబెట్టడానికి, పూర్వంలాగా ఇపుడు నాజీలకు వ్యవధి చిక్కడంలేదు. ఒక్క 5 రోజులలోనే, 8 టాంకుదళాలను, 14 కాల్బలదళాలను నాజీలు పోగొట్టుకున్నారు. చిందరవందరగా పారిపోతున్న నాజీంను వెన్నంటుతోంది రెడ్ఆర్మీ.

కీవ్రంగంలో ఈక్రొత్తదాడి ప్రారంభించినపుడు యుద్ధరంగం 50 మైళ్ళుమాత్రమే. ఇపుడు 250 మైళ్ళవరకు పెరిగింది. రోజా వందలకొలది పట్టణాలు - పల్లెలు నాజీ చెర నుండి తప్పించబడుతున్నాయి. మొదటి 5 రోజులలో 1000 ప్రదేశాలకు విముక్తి గల్గింది. జితోమిర్కు దక్షిణంగా బెర్డిచావ్ను ప్రక్కగా దాటింది రెడ్ఆర్మీ. మరోప్రక్క జితోమిర్కు ఆగ్నేయంగా బైలయాసెర్కావ్ వైపుకు పురోగమించుతోంది రెడ్ఆర్మీ. అటు పోలండునుండి. ఇటు నీపరుమలుపునుండి వచ్చేమార్గాలకు ఇవి రెండూ కూడలిస్థానాలు. ఈ రెండిటినీ కలుపుతున్న ముఖ్య రైల్వే జంక్షన్ కజాటిన్ వశమయింది. కజాటిన్ను పట్టుకోడం యుద్ధచరిత్రలోనే గొప్ప విజయమని ముమ్ముందు నిరూపించగలదు.

నీపరుమలుపుకోకూడ నికోపోల్ను వశపరచుకోడానికి రెడ్ఆర్మీ దాడి ప్రారంభించింది. త్వరలోనే ఈ దాడి, కిరోవోగ్రాడ్ - నికోపోల్ రైలుమార్గానికి అంటిపెట్టుకున్న జర్మన్లను నాశనం చేస్తుందని ఊహించవచ్చు.

క్రొత్తదాడులకు అవసరమైన రిజర్వు బలాలను సమకూర్చుకొని రెడ్ఆర్మీ ఈ విజయాలను సాధించింది. రెడ్ఆర్మీలాగా రాత్రిస్సు ఇంత పెద్దఎత్తునయుద్ధాలు సాగించడం, మిలటరీ చరిత్రలోనే ఎన్నడూ చేదు.

1943 లో నాజీ ఆక్రమిత ప్రదేశంలో మూడింట రెండువవంతు రెడ్ఆర్మీ ఒక్కటియే విముక్తిగావించింది. రెడ్ఆర్మీకొట్టే ఈ దెబ్బలకుతోడు,అటు రెండవరంగ సన్నాహాలు జర్మనీకి 1918 ని జ్ఞాపకంచేస్తున్నాయి. ఐజన్హోవర్ యూరప్పై దండయాత్రచేసే సైన్యాలకు సర్వసైన్యాధిపతిగా నియమించబడ్డాడు. షారన్హార్స్టువంటి పెద్ద జర్మనునౌక బ్రిటిష్ నౌకలచే ముంచబడటం, బెర్లిన్పై నిరంతరదాడి, నాజీ సైనికులలోను, జర్మనీలో అపజయభయం వ్యాపింపజేస్తోంది. అందుకనే గోబెల్సు "మీరు నష్టపడేదేమీలేదు. పోయిందంతా ఇదివరకే పోయింది. ఇపుడైనా తీవ్రంగా పోరాడండి" అని గోలపెడుతున్నాడు."1944 మనకుమహాక్లిష్టసంవత్సరం" అని హిట్లరు, హెచ్చరిస్తున్నాడు.

రాజుగారికి ఉద్వాసన

రెడ్ఆర్మీ విజయాలు గెరిల్లా సైన్యాలనుత్సాహపరుస్తున్నాయి. వీరు ఎన్నికష్టాలనైనా ఎదుర్కొన సిద్ధపడుతున్నారు. మార్షల్ టిటో సైన్యాలు (2½ లక్షలు) యుగోస్లావియాలో 14-15 జర్మను డివిజన్లను ఎదుర్కొంటున్నాయి. జర్మనీవేగాక, దానిక్రింద తొత్తులుగా పనిచేస్తున్న హంగేరీ మొదలగు దేశాలసైన్యాలు కలుపుకుంటే 5 లక్షలుంటాయి. వాటిని యుగోస్లావ్ గెరిల్లాలు ఎదిర్చి పోరాడుతున్నారు. అలెగ్జాండ్రియాలో మిత్రసైన్య ప్రతినిధులకు, టిటోకు జరిగిన ఒడంబడిక ఫలితంగా మధ్యధరా సముద్రంలోని మిత్రసైన్యాల సహాయం, ఇకనుంచి మార్షల్ టిటోకి లభించగలదు.

ఇంతేగాక గతవారం తెలియచేసినట్లు కైరోలోని పీటరురాజు హక్కులను తొలగించుతూ, యుగోస్లావియాలోని స్వతంత్ర కమిటీ తీర్మానించింది. దానిఫలితంగా కైరోలోనున్న పీటరురాజుక్రింద పనిచేసే సర్వసైన్యాధిపతి రాజీనామా పెట్టాడు. ఆ విధంగా యుగోస్లావియా ప్రజలైక్యతతో అక్షరాజ్యాలను ఎదిరించుతూ, తమదేశ చరిత్రనే మార్చివేస్తున్నారు కైరోలో కూర్చున్న పీటర్ప్రభుత్వం ఎట్టి పిచ్చిపిచ్చి ప్రకటనలు గావించినా స్వతంత్ర యుగోస్లావియా పురోగమనాన్ని అడ్డలేదు.

పసిఫిక్ లో

"నేను ఎలుగుగొడ్డును పట్టుకున్నాను. కాని అది నన్ను వదలడంలేదు" అన్న సామెత జర్మనీకి వర్తించుతోంది. జర్మనీ, సోవియటు అనే ఎలుగుగొడ్డును పట్టుకుంది. కాని అది జర్మనీని వదలడంలేదు. అలాగే జపానుకుకూడా మరొక సామెత వర్తిస్తుంది. "పులిపై ఎక్కడం సులభమే. కాని ఎక్కిన తర్వాత దిగడం అంత సులభంకాదు" జర్మనీవలెనే జపానుకూడా యుద్ధవ్యూహంలో చొరవను కోల్పోయిందంటూ, మాస్కో పత్రిక "వార్అండ్వర్కింగ్క్లాస్" పైసామెతను తెల్పింది.

అదే పత్రిక ఇంకా ఇలా చెప్పింది. "జర్మనీ జపానుపై ఆశపెట్టుకొంది. సోవియట్పై దెబ్బతీస్తుందని ఆశించింది. కాని ఈ విషయంలో జపాను కొంచెంబుద్ధిని ఉపయోగించింది. బ్రిటన్ అమెరికాలకుకూడ విపరీతమైన మిలిటరీ నష్టాలను కల్గించి జర్మనీ పరిస్థితిని బాగుపరుస్తుందేమోననికూడ జర్మనీ ఆశించింది. కాని, అదీ విఫలమయింది. జర్మనీ విజయాలనుచూచి ఫ్రాన్సు పడిపోయిన తర్వాత యుద్ధంలో దిగిన జపాను, ఈ నాడు జర్మనీ అపజయాలను చూచి నిస్పృహ చెందుతోంది."

దీని అర్థం అక్షరాజ్యాలలో ఎవడితోవ వాడిదిగా ఉందన్నమాట. ఇందుకు నిదర్శనం గోబెల్సు ఏడుపు చూడండి " ఇతరులవల్ల సహాయం వస్తుందని ఎదురుచూట్టం పనికిరాదు. మంత్రంపెట్టిన పాములాగా, వాళ్ళు (జపాను) మెదలకుండా కూర్చున్నారు. అలా కూర్చుంటే వాళ్ళ వినాశం తప్పదు. మనం స్వయం సహాయంపైననే ఆధారపడాలి."

జపాను పసిఫిక్లో రోజురోజు దెబ్బతింటోంది. మిత్ర సైన్యాలు న్యూబ్రిటన్లో ఆర్వేద్వీప కల్పాన్ని వశపరచుకొన్నాయి. ఇచట మిత్ర సేనలు మెర్కస్ అగ్రాన్నికూడా వశపరచుకొన్నాయి. అవతల తీరాన గ్లస్టర్ అగ్రంలో అమెరికా సైన్యాలు దిగాయి. గ్లస్టర్ అగ్రం గనుక రెడ్ఆర్మీ వశమయితే, విటియాజ్ అఖాతంలో మిత్రనౌకలస్వేచ్ఛగా తిరగవచ్చు. అప్పుడు న్యూగినీలోని జపాను రేవు పట్టణాలకు పెద్దదెబ్బ గొట్టవచ్చు. న్యూబ్రిటన్లో మిత్రసైన్యాల లక్ష్యం జపాను ముఖ్య దుర్గాలైన రాబాల్, గస్మాటాలను పట్టుకోవడం.

ఈవిధంగా నైరుతిపసిఫిక్లో ఒక్కొక్క కీలకప్రదేశంనుండి జపానును మిత్రసైన్యాలు తరిమివేస్తున్నాయి. కాని బర్మారంగంలో తిరుగుదండయాత్ర తక్షణం జరిగేటట్లు కనబడడంలేదు. జపానును మన సరిహద్దులనుండి తరమడానికి ఇంకా పూనుకోలేదు. దీనికి కారణంఏమిటి? అలాంటి ఎదురుదాడికి భారతదేశ పరిస్థితులను చక్కపరచాలి. కానిబెంగాల్క్షామమూ, రాజకీయప్రతిష్టంభనం అలాగే వున్నాయి. ఈ పరిస్థితే బర్మాపై తిరుగుదాడులు సాగించడానికి అడ్డువస్తోంది.

ఈలోగా జపానువిమానదాడులకు మనదేశం గురికావలసి వస్తుంది. అందుకు నిదర్శనం చిట్టగాంగ్పైదాడీ, అరకాన్ తీరంలో జరిగిన తీవ్ర విమానయుద్ధాలే నిదర్శనం. 3-1-44

దగా ప్రకటనలకు మోసపోవద్దు

కృష్ణాజిల్లా రైతుసంఘ కార్యాలయం, కాళేశ్వరావు మార్కెటు బెజవాడకు మార్చబడినట్లు పామిరెడ్డి సుబ్బారెడ్డి రైతుసంఘ ఏజంటుగా ఆంధ్రప్రభలో ఒక ప్రకటన చేశారు. కృష్ణాజిల్లా రైతుసంఘం ఆఫీసు ఎక్కడికీ మార్చలేదు. గవర్నరుపేటలో కాట్రగడ్డవారి మేడలోనే ఉన్నది.

ఏజెంట్లు ఎవరూలేరు. సుబ్బారెడ్డిగారు రైతుసంఘంలో ప్రాథమికసభ్యుడైనాకాదు. జిల్లా రైతుసంఘం 1935 లో స్థాపించబడి, దినదినాభివృద్ధి చెందుతూ జిల్లారైతులవిశ్వాసాన్ని చూరగొన్నది. రైతుసంఘాన్ని విచ్ఛిన్నం చేయడానికి కొద్దిమంది రైతుసంఘ విద్రోహులు యీ విధంగా చేసే దగాప్రకటనలకు రైతులెవరూ మోసపోవద్దని హెచ్చరిస్తున్నాను.

కాట్రగడ్డ రాజగోపాలరావు,
(కార్యదర్శి, కృష్ణాజిల్లా రైతుసంఘం)

★

విసన్నపేట రహదారిబంగళాకేసులో

ముద్దాయిలు నిర్దోషులని తీర్పు

4-12-42వ తేదీన విస్సన్నపేట ఎల్.ఎఫ్. బంగాళా తగులబెట్టారను నెపంతో, కామ్రేడ్స్ సయ్యద్ సాలారు (తి. తాలూకా రైతుసంఘాధ్యక్షులు,) కాశీ సోమశేఖరాచారిని, శ్రీ నాయుడు సుబ్బయ్య మొదలైనవారిని (పార్టీ సానుభూతిపరుడు)పోలీసులు అరెస్టుచేసి బెజవాడ సబ్కలెక్టరుగారి వద్ద కేసును దాఖలు చేశారు.

5 నెలలు సబ్జైలులో ఉన్నతరువాత ముద్దాయిలను బెయిలుమీద విడుదలచేశారు—

అప్పటినుంచి కేసు వాయిదాలు పడుతూ వస్తుంది—

పోలీసులకు అనుకూలమైన సాక్ష్యం లేకపోవుటచేత, యల్. యఫ్. ఇంజనీరుగారు కూడా నిజమేచెప్పుటచేత, 28-12-43 న తేదీని సబ్కలెక్టరుగారు ముద్దాయిలు నిర్దోషులని తీర్పు చెప్పాడు—

★

విడుదలలు

ఆగస్టు సంక్షోభం! తరువాత డిటైన్ చేయబడి, డిసెంబరు 30వ తేదీన విడుదలైన పశ్చిమగోదావరిజిల్లా కమ్యూనిస్టునాయకులు : ఉద్దరాజు రామం, గారపాటి సత్యనారాయణ, భూపతిరాజు లక్ష్మీనరసింహరాజు, తనికెళ్ళ చలపతి, పి. మృత్యుంజయుడు, ఆకుల సుబ్బారావు.

★

అరెస్టులు

నైజాంరాష్ట్రమందలి నల్లగొండ జిల్లాలో కామ్రేడ్ మురహరిరావు, జాగీర్దార్ల అక్రమ వసూళ్ళకు వ్యతిరేకంగా ప్రజల్ని సమీకరిస్తూంటే, పోలీసులు 28-12-43 వ తేదీని ఎరస్టుచేశారు. ప్రభుత్వానికి ధాన్యం యివ్వవద్దని రైతులలో ప్రచారం చేస్తున్నట్లు నేరం ఆరోపించబడింది. కామ్రేడ్ ఆరుట్లరామచంద్రారెడ్డిమీద కూడా యిదేనేరం ఆరోపించారు.

వీరు ఆంధ్రమహాసభ తరఫున రైతులలో ప్రచారం చేస్తున్నారు. ఆహారసమస్యను పరిష్కరించుటకై నైజాం ప్రభుత్వం ప్రవేశపెట్టినధాన్యం వసూళ్ళస్కీమును బలపరుస్తూ కొన్ని సవరణలకై ఆందోళన చేస్తున్నారు.

కార్మికవర్గంపై ద్వేషం ఉత్పత్తిని కుంటుపరుస్తుంది

విశాఖపట్నంలో సింధియా కంపెనీ (యింజనీరింగు) యజమానులు 40 మంది కార్మికులను అక్రమంగా పనినుంచి తీసివేశారు. వారితో బాటు, యూనియన్ వైస్‌ప్రెసిడెంటు కామ్రేడ్ అచ్యుతశర్మనుకూడ పనినుంచి తొలగించారు. కార్మికులు చేసిన నేరమేమిటి? సింధియా - హెచ్. సి. సి. కార్మికులు తమ సంఘాన్ని నిర్మించుకొని, కార్మిక హక్కులను నిలబెట్టి, దేశరక్షణకు తోడ్పడుటయే ధనిక యజమానులకు నేరమగుచున్నది.

ఆంధ్రదేశములో చక్కని యింజనీరింగు పని చేసేవారు సింధియా కార్మికులు. తక్కువ కూలి యిచ్చి చుట్టుపక్కల పల్లెలలోని కార్మికుల శ్రమను దోచి, తమ లాభాలను వృద్ధి చేసుకోవడం సింధియా పెట్టుబడిదారుల ఆశయం. ఈ ఆశయంతో కార్మికుల సంఘాన్ని విచ్ఛిన్నం చేయుటకు పూనుకొన్నారు. ఇంజనీరింగు సామగ్రి నేడు దేశానికి ఎంతైనా అవసరం. కార్మికుల యిబ్బందులతీర్చి, వారి సలహాలను అనుసరించి ఉత్పత్తిని వృద్ధిచేయడమే నేడు నిజమైన దేశసేవ అనబడుతుంది. కాని సింధియా యజమానుల వైఖరి దీనికి విరుద్ధంగాఉంది.

వీరు కార్మిక సంఘాన్ని విచ్ఛిన్నంచెయ్యడానికి కొత్తపన్నాగాలు పన్నారు. కంపెనీ యూనియన్ అంటూ ఒక బూటకపు యూనియన్ని యజమానులు ఏర్పాటుచేశారు. అందులో చేరమని కార్మికులను నిర్బంధిస్తున్నారు. చట్టవిరుద్ధమైన బాండులమీద సంతకాలుపెట్టించుకొంటున్నారు. ఈబాండులమీద సంతకాలు చేయనివారిని పనినుంచి తొలగిస్తారట. యజమానులు కంపెనీ సంఘాలను నిర్మించి కార్మికులను నిర్బంధించడం, కార్మికులు పొందిన ట్రేడ్‌యూనియన్ ఆక్టుయొక్క హక్కును అపహరించడమన్నమాట. సింధియా యజమానులు కార్మికులను అక్రమంగా పనినుంచి తీసివేయడం మానాలి. కంపెనీ యూనియనును, బాండులను, రద్దుచేయాలి. ఉత్పత్తిని వృద్ధిచెయ్యడానికి కార్మికుల సహకారంపొందాలి. కార్మికులహక్కులను, కార్మిక సంఘమును గుర్తించాలి. తీసివేసిన కార్మికులను వెంటనే పనిలోపెట్టుకోవాలి. కార్మికసంఘాలన్నీ సోదరసింధియా కార్మిక సంఘానికి సానుభూతి, సహకారాలు చూపాలి. యజమానుల అక్రమప్రవర్తనను అరికట్టి, ఉత్పత్తికి దెబ్బతగలకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

జ్యూటు ఉత్పత్తిపై మిల్లు యజమాని దాడి

ఏలూరు పట్టణములోని శ్రీ కృష్ణా జ్యూటు మిల్లులో దాదాపు 1200 మంది కార్మికులు పనిచేస్తున్నారు. నేలమీదనున్న విమానాలను మరుగుపరచడానికి కావలసిన గొనెవలలు, ఆహారపదార్థాల రవాణాకు అవసరమయిన గోనెసంచులు, యీ మిల్లులో ఉత్పత్తి అవుతాయి.

ప్రస్తుతము మిల్లులో ఉత్పత్తి కావలసినంతగా జరుగుటలేదు. సుమారు 30 మగ్గాలు వృధాగా ఉండిపోతున్నవి. మిల్లు మేనేజరు కార్మికులయెడల అవలంబించే నిరంకుశ ప్రవర్తనవల్ల, కలుగచేసే బాధల మూలంగా, కార్మికులు వేరే పనులకు పోతున్నారు.

ఏలూరు కార్మికులకు కూలి 0-5-0 లు మాత్రమే. కలకత్తా, చిట్టివలస, కార్మికులకు 0-14-0 నుంచి, 1-2-0 వరకు యిస్తున్నారు. కరువుభత్యము రూపాయికి 0-1-0 నుంచి 0-2-0 వరకు మాత్రమే. సెలవులు దొరకుట దుర్లభము. బోనసుగాని, ప్రావిడెంటు ఫండుకానిలేదు. వైద్యసహాయం సరిగ్గాలేదు. గత నెల 21 వ తేదీని మిల్లులో పనిచేస్తున్న స్త్రీ వర్కరు బందెమ్మకు, బెల్టుతెగి, నెత్తిమీదనుంచి ముఖంమధ్యగా గాయమై,స్పృహతప్పి పడిపోయినప్పుడు ఏదో ప్రథమచికిత్స చేసి యింటికి పంపారు మిల్లు అధికారులు. స్థానిక ట్రేడ్‌యూనియను కౌన్సిలువారు వెంటనే ఆమెను జనరల్‌హాస్పిటలులో ప్రవేశపెట్టారు.

కార్మికులను బెదరి చడానికి మేనేజరు పోలీసుల సహాయం కోరుతున్నాడు. కార్మికులు సంఘంలోచేరితే కుటుంబాలతోసహా నాశనముచేస్తాననీ, క్రిమినలు కేసులు పెడతానని, బెదరిస్తున్నాడు.

అధికోత్పత్తికి సహకారం చేస్తామని కార్మికులు చెప్తుంటే, ఉత్పత్తిమీద దాడిచేస్తున్నారు జ్యూటుమిల్లు యజమానులు. అయినప్పటికీ, జ్యూటు కార్మికులు తమ ఐకమత్యబలంతో దేశరక్షణకు పాటుపడతారు. తమ హక్కులను నిలబెట్టుకొంటారు.

★

హెల్తు ఆఫీసరు పట్టణ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడు

బెజవాడ మార్కెట్టులో పనిచేసే మున్సిపలు కార్మికులు హెల్తుఆఫీసరుకు తమ యిబ్బందులను తెలియజేసుకొంటే, అతను మండిపడుతూ ఒక కార్మికుని పనినుంచి తీసివేశాడు. ఆ పని చేయించుటకు కొంతమంది "దొంగకూలీల"ను యితరచోట్లనుంచి తెప్పించాడు. వారు, తమ సోదర పనివారికిచేసిన అన్యాయం తెలుసుకొని వెళ్ళిపోయారు. యూనియను ప్రతినిధి ఆఫీసరుతో సంప్రతించుటకు ప్రయత్నిస్తే, ప్రయోజనము లేకపోయింది. చైర్మన్, హెల్తుఆఫీసరు — పట్టణ ప్రజల ఆరోగ్యముచెడిపోతే తమకేమి అన్నట్లు 4, 5 రోజులు నిర్లక్ష్యముచేశారు. దొడ్లు మురిగిపోయి, మార్కెట్టు ఆరోగ్యాన్ని పాడుచేసేటట్లు అయిపోయాయి. తనకు నష్టము కలగచేసినప్పటికీ, ప్రజల ఆరోగ్యం కాపాడుట ముఖ్యకర్తవ్యమని తీసివేసిన కార్మికుడు దొడ్లు తుడుచుటకు ప్రయత్నిస్తుంటే హెల్తు ఆఫీసరు ఆపుచేయించాడు. హెల్తు ఆఫీసరు చర్య ప్రజలకు నష్టము కలుగజేస్తుందని, తక్షణమే యూనియను వాలంటీర్లు మురిగిపోయిన దొడ్లను శుభ్రపరుస్తున్నారు. హెల్తుఆఫీసరు కార్మికుల హక్కులను గుర్తించేటట్టు ప్ర[illegible]త్తి[illegible]స కురావాలి.

ఆహారపంటల అధికోత్పత్తికి రైతు-కూలీల ఐక్యత

దివి తాలూకా (కృష్ణా) నాగాయలంక ఫిర్కాలో రైతులు,కూలీలుతమతమ సంఘాల ద్వారా, అధికాహారోత్పత్తికై అదనపుభూమిని సాగుకు సంపాదించుకొనగల్గుతున్నారు. నాగాయలంకలో, గ్రామరైతుసంఘంవారు జిల్లాకలెక్టరువద్దకు రాయబారంవెళ్ళి, రివర్ కన్సర్వెన్సీ డిపార్టుమెంటుకు పిటీషన్లుపెట్టి, య 1కి రు. 6-4-0 శిస్తుకు 120 యకరాల విస్తీర్ణంగల కృష్ణలంకలను 3 సంవత్సరాల సాగుకు అర్జుతెచ్చుకున్నారు. రైతులు రెల్లు దుబ్బులనుతీసివేసి, మొక్కజొన్న - కంది - జనుము వగయిరా పైరులువేశారు. ఈ విధంగానే ఏకనూరు, పెదపాలెం, ప్రరచివర, ఏటిమొగ, గల్లలమోద, మొదలైన గ్రామాలలో కూలీలు లేబర్ సొసైటీలను రిజిస్టరు చేయించుకొని, వాటిద్వారా గవర్నమెంటు లంకలను శాంక్షన్ చేయించుకున్నారు.

నారి, ఉపకాలి, సొర్లగొంది, మూలపాలెం, నాచుగుంట, యేలిచెట్లదిబ్బ, ఎదురుమొండి, మొదలైన గ్రామాలలోని బంజరు భూమిని నాగాయతిప్ప షాహుకార్లు సరకుతోట వేయుటకై ప్రయత్నిస్తున్నారు. ఆభూములలో ప్రజలు చోళ్ళు పండించుకొంటున్నారు. షాహుకార్లుచేసే ప్రయత్నానికి తోడ్పడవద్దని ప్రజలు సమిష్టిగా ఆందోళన గావిస్తున్నారు.

ఈ ఫిర్కాలోనే 10 కూలీ పల్లెలనుండి 32 రు ప్రతినిధులు నాగాయలంకలో సమావేశమై, రోజుకు 7 గంటలచొప్పున ఖచ్చితంగా పనిచేయుటకు, పురుషునికి 0-12-0, స్త్రీకి 0-10-0 చొప్పున కూలి అడుగుటకు, నిర్ణయించుకున్నారు.

కైకలూరు తాలూకాలో

వడాలి గ్రామంలో కోతల ప్రారంభంనుండి రైతులలో చాలామంది రోజుకు 0-10-0, 0-11-0 చొప్పున కూలియిచ్చుటకు, కూలీలు రోజుకు గం 7 చొప్పున పనిచేయడానికి, నిర్ణయించుకొని, పనులు కొనసాగించుకొంటున్నారు. అధికపంటలను పండించుటకై యీ ఈవిధంగా రైతులు-కూలీలు తమకర్తవ్యాన్ని గుర్తించారు. ఈసామరస్యం కుదురకపూర్వం కూలీలకు 0-7-0, 0-8-0 మాత్రమే యిచ్చేవారు. వారు 5 లేక 5½ గంటలు మాత్రమే పనిచేసేవారు.

తెనాలి తాలూకాలో

ఇలాగే, తెనాలి తాలూకా సంగంజాగర్లమూడిలో 45 గురు కూలీలు 8 ఎకరాల పొలంలో రోజుకు గం 7 చొప్పున పనిచేసి, రైతులవద్ద 3 మానికల ధాన్యం చొప్పున తీసుకున్నారు.

సత్తెనపల్లి తాలూకాలో

ఈ తాలూకాలో భృగుబండ గ్రామ కరణం, మరి యిద్దరుకలిసి 11 గురు రైతులపై యుద్ధ ప్రతికూలంగా ప్రచారం చేస్తున్నట్లు అక్రమ రిపోర్టులు యిచ్చారు. రైతులు చాకళ్ళచేత, జీతగాండ్లచేత పై ముగ్గురమీద సంఘ బహిష్కారం చేయించారు. రైతులుదొమ్మీగా వస్తూన్నారని కరణం మరొకరిపోర్టుపంపాడు. ఈఉభయపార్టీలవారు సత్తెనపల్లివచ్చినప్పుడు, రైతుసంఘ వర్కర్లు తాలూకా రైతుసంఘ కార్యాలయంలో సమావేశపరచి, బహిష్కారం తప్పని రైతులకు, కేసులు ఉపసంహరించుకోవలసిందని కరణానికి, నచ్చజెప్పి, ఒప్పించారు.

అబ్బిరాజుపాలెంలో రెండు ముఠాల రైతులు పొలంగట్లమీదుగా నీరుపోతూన్నదని తగాదాలుపడి, కోర్టుకెక్కి, షుమారు 1 వేయి రూపాయలు ఖర్చుచేశారు. రైతుసంఘ వర్కర్లు ఉభయుల్నీ సమావేశపరచి, రాజీ కుదిర్చారు. తప్పు ఉభయులదీనని గ్రహించి, కరస్పర్శచేసుకొని, సంతోషంతో వారు తిరిగి వెళ్ళారు.

ఇలాగే, ముప్పాళ్ళలో ఒక యింటి ముందున్న నీటిని బయటికి ప్రవహింపజేసే విషయంలో యిద్దరు తగాదా పడి, కేసులు పెట్టుకున్నారు. వీరి తగాదానుకూడా తాలూకా రైతుసంఘంవారు పరిష్కరించి, ఉభయుల్నీ సంతృప్తిపరచి పంపించారు.

ఆత్మకూరు తాలూకాలో

నెల్లూరుజిల్లా, ఆత్మకూరు తాలూకాలో నావూరు అనే గ్రామముంది. అక్కడి రైతుల మధ్య 2 ఏండ్లుగా పార్టీలు బయలుదేరి, విపరీతమైన కలహాలకు కారణమౌతూవచ్చాయి. కాని, రైతువర్కర్ల ప్రచార ఫలితంగా, ఉభయులు రాజీపడి, రైతుసంఘంలో సభ్యులుగా చేరారు.

కొండూరు గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా పార్టీలేర్పడి, అశాంతిప్రబలియుండేది. ఇరుపక్షాలవారు,రైతువర్కర్ల కృషిఫలితంగా, రైతుసంఘంలో యేకమయారు. గ్రామంలో పేద వేలాం మొదలుకొని అన్నిపనులు రైతుసంఘ నాయకత్వంకింద జరుగుతున్నాయి. పశువులు చేలల్లోపడితే, వాటిని రైతులు రైతుసంఘ కార్యదర్శి దొడ్లో కట్టివేస్తారు. పశువుకువేసే జుల్మానా రైతుసంఘ నిధికి యిస్తున్నారు.

ఈ విధంగా రైతులు - కూలీలు సంఘీభావంతో చేయి, చేయి కలిపి ముందుకు నడుస్తున్నారు. అధికపంటల ఉత్పత్తికి తమ కర్తవ్యాన్ని గుర్తిస్తున్నారు.

★

యూనియన్లను గుర్తించే బిల్లుపై సూచనలు

కేంద్రప్రభుత్వం ట్రేడ్‌యూనియన్ అమెండ్‌మెంటుబిల్లు (యూనియనులను గుర్తించే బిల్లు)ను ప్రవేశపెట్టబోతూంది. ఆంధ్రరాష్ట్ర ట్రేడ్‌యూనియనుకౌన్సిలు ఈదిగువ సవరణలను సూచిస్తూంది. అన్ని కార్మికసంఘాలు ఈసవరణలనుబలపరుస్తూ కేంద్రప్రభుత్వానికి పిటీషన్లు పంపాలని కౌన్సిలు కోరుతూంది.

1. యూనియను సభ్యులను అక్రమంగా పనిలోనుంచి తీసివేయకుండా తగిన రక్షణ బిల్లులో ఉండాలి.

2. గవర్నమెంటు పనివారలు, రైల్వే, పోర్టు, కార్మికులుకూడ ఈ బిల్లుకిందికిరావాలి.

3. ఏ యూనియనునయినా గుర్తించాలని రికగ్నిషన్‌బోర్డు నిర్ణయిస్తే, ప్రభుత్వం ఆ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి.

4. వ్యక్తిగత కార్మిక కేసులుకూడ ఒక ముఖ్యసమస్యకు వర్తిస్తాయి, కాన చట్టరీత్యా పరిష్కారానికి తావుండాలి.

5. సమ్మెలు చట్టవిరుద్ధమని నేటి శాసనాలలో ఉంది. యూనియన్ సభ్యులుగాని, బాధ్యులుగాని, సమ్మెల్లో పాల్గొనినట్లయితే, దీన్ని అవకాశంగా తీసుకొని యూనియను రికగ్నిషన్ని రద్దుచేయకూడదు.

6. బిల్లుకు సంబంధించిన చిత్తురూల్సు యీలోగా యూనియనులకు పంపాలి.

పై సవరణలతో బిల్లును ఆమోదిస్తూ సంఘాలు తీర్మానించాలి.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE